


సూపర్ సిక్స్‌లో భాగమైన స్త్రీ శక్తి పథకం అమలుతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు. మహిళల కోసం 33% రిజర్వేషన్‌లు, డ్వాక్రా ప్రోత్సాహం, ఇళ్ల పట్టాలు వారి పేరుతో, విద్యా-ఉద్యోగ అవకాశాల పెంపు, మహిళా కండక్టర్ల నియామకం వంటి చర్యలు చంద్రబాబు సంకల్పానికి ప్రతీక.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 16.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 125 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



## అభివృద్ధి, సంక్షేమంలో..

# సూపర్‌హిట్

- బనకచర్లను ప్రస్తావిస్తూ... ఎగువ రాష్ట్రానికి ప్రశ్నలు
- రాజకీయ ముసుగులో నేరాలంటూ వైసీపీకి చురకలు
- కేంద్ర సాయంతో కీలక ప్రాజెక్టులు వస్తున్నాయని వెల్లడించిన సీఎం
- అమెరికా విధించిన సుంకాలపై ప్రస్తావన...
- భారత్ ది డెడ్ ఎకానమీ కాదు.. గుడ్ ఎకానమీ అన్న చంద్రబాబు
- అభివృద్ధి - సంక్షేమాల ప్రగతిని ప్రతిబింబించేలా ఆయా శాఖల శకటాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాంతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. సూపర్ సిక్స్ హామీలు మొదలుకుని.. వివిధ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి తన పంద్రాగస్టు ప్రసంగంలో ఏకరువు పెట్టారు. సూపర్ సిక్స్... సూపర్ హిట్ అంటూ స్వాతంత్ర్య దినోత్సవ వేదిక నుంచి చంద్రబాబు సగర్వంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు అమలు చేసిన సామాజిక భద్రత ఫించన్లు మొదలుకుని శుక్రవారం ప్రారంభించిన స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వరకు ప్రతి అంశాన్ని ఆసాంతం వివరించారు. ఫించన్లు, తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ

మిగతా 2లో...




## మార్పు మననుంచే రావాలి

- గాంధీజీ మనకిచ్చిన పవర్ ఫుల్ వెపన్ అహింస
- మన దేశ పవర్ ఫుల్ మిస్సైల్ నరేంద్ర మోదీ
- స్వాతంత్రోద్యమంలో గుంటూరు జిల్లా చెరగని ముద్ర
- డబుల్ ఇంజన్ సర్కారుతో విజయవంతంగా తొలిఅడుగు
- ఏడాదిలో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఈరోజు మహాత్మా గాంధీ చెప్పిన ఒక్క గొప్ప విషయం నాకు గుర్తుకు వస్తోంది. ప్రపంచంలో ఏ మార్పు రావాలని కోరుకుంటున్నావో ఆ మార్పు నీ నుండే మొదలవ్వాలని గాంధీజీ చెప్పారు, ఆ మహనీయుని స్ఫూర్తితో మార్పు మన నుండే మొదలుకావాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ నా శుభాకాంక్షలు.

మిగతా 3లో...

## స్త్రీ శక్తి'తో మహిళలకు మేలు

- చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకూ మహిళలకు ఫ్రీ సర్వీస్
- ఎలక్ట్రిక్ బస్సుల్లో మహిళలకు డ్రైవర్లుగా అవకాశం కల్పిస్తాం
- ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తాం
- ఉండవల్లి నుంచి విజయవాడ బస్టాండ్‌కు ఆర్టీసీ బస్సులో సీఎం ప్రయాణం
- సీఎంతో కలిసి బస్సులో ప్రయాణించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్వాతంత్ర్యం దినోత్సవం రోజున ఈ స్త్రీశక్తి పథకానికి శ్రీకారం చుట్టామని, మహిళలకు మేలు చేస్తున్నామన్న తృప్తి కలుగుతోందని వెల్లడించారు. రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించామన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకురావడంతో పాటు వారి గౌరవాన్ని పెంచడం కోసం ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. సూపర్ 6 హామీల్లో ప్రతిష్టాత్మక స్త్రీ శక్తి పథకాన్ని ఉండవల్లి నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధియక్షుడు మాధవ్ తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. బస్సులో ప్రయాణించే మహిళలకు జీరో ఫేర్ టికెట్‌ను అందించారు. ఉండవల్లి నుంచి మహిళలతో కలిసి విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్

మిగతా 3లో...

## అంతర్గత శత్రువులను కనిపెట్టాలి

- సుస్థిర పాలనతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం
- పెట్టుబడులు రావాలంటే లా అండ్ ఆర్డర్ బలంగా ఉండాలి
- ఏడాది పాలనలో సూపర్ సిక్స్ అమలు చేశాం



కాకినాడ(జర్నలిస్ట్ ఫైల్) : 'రాష్ట్ర అభివృద్ధి జరగాలి.. సూపర్ సిక్స్ పథకాలు నిరాటంకంగా అమలు కావాలి.. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలి అంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బలంగా ఉండాలి. అందుకు సుస్థిరతతో కూడిన పాలన అవసరం. ప్రభుత్వానికి శాంతి భద్రతల నిర్వహణ కూటమి మీద,

మిగతా 2లో...

## 'స్త్రీ శక్తి'కి ఎదురులేదు

- అమల్లోకి వచ్చిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు
- జీరో ఫేర్ టికెట్ తో బస్సు ప్రయాణం ఇక ఫ్రీ
- స్త్రీ శక్తి పథకం మహిళా లోకానికి మరో నవశకం.

3 లో..▶

## పేదల సంక్షేమమే ధ్యేయం



- ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ అమలు
- జిల్లా సమగ్రాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా కృషి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- యువజన, స్త్రీ శక్తికి ప్రత్యేక ప్రాధాన్యం
- బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రధాన లక్ష్యం

శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని.,ఈ దిశగా అనునిత్యం ప్రజానీకానికి ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన 79వ పంద్రాగస్టు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి, పతాకావిష్కరణ చేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా సమగ్రాభివృద్ధిపై తన సందేశం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జిల్లాలో అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం,

2 లో

## సమాజాభ్యున్నతికి కృషి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్యం ద్వారా మనకు స్వేచ్ఛ లభించింది గాని ప్రతి ఒక్కరూ వారి వారి బాధ్యతలను తెల్సుకుని మన ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తూ సమాజాభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభాపతి సిహెచ్. అయ్యన్న పాత్రుడు సూచించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించిన పిదప

మిగతా 2లో...



## రాష్ట్రానికి జీవనాడి పోలవరం

**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తికరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ భారతావనికి స్వేచ్ఛా, స్వాతంత్రాలు



అందించిన మహనీయులను స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవలసిన

మిగతా 3లో...

## సూపర్‌సిక్స్‌లో మరోఅడుగు



**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) :** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ప్రతి అడుగు వేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకం అమల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ప్రారంభించారు.

4 లో..▶

## ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- రాష్ట్రంలో 5 రాష్ట్రస్థాయి ఆహార నాణ్యత పరీక్షా కేంద్రాలు
- రూ.85 కోట్ల వరకు వ్యయం
- మరో నెలలో తిరుమల, విశాఖలో కార్యకలాపాలు ప్రారంభం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల ఆరోగ్యదాయక జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో సుమారు రూ.86 కోట్లతో 5 ఆహార నాణ్యతా పరీక్షా కేంద్రాల్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు సుమారు రూ. 20 కోట్ల వరకు ఖర్చుపెడుతున్నామని చెప్పారు. ఈ కేంద్రాల్లో సమకూరే అత్యాధునిక యంత్ర పరికరాల ద్వారా ఆహార పదార్థాల నమూనాలను పరీక్షిస్తారని చెప్పారు. వీటిల్లో తిరుమల, విశాఖలలోని ల్యాబొరేటరీ నమూనాల పరీక్షలు మరో నెల రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్. ఎస్ ఎస్ ఎ.ఐ) తో కుదిరిన ఒప్పందం మేరకు ఈ కేంద్రాల ఏర్పాటు జరుగుతోందన్నారు.

**తిరుమల భక్తుల కోసం ప్రత్యేక రాష్ట్ర స్థాయి ల్యాబొరేటరీ :** శ్రీవారి భక్తుల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వచ్చే నెలాఖరునాటికి ఈ ల్యాబొరెటరీని వినియోగానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గత వైకాప ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యి ఘటన వల్ల భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తిరుమలలో ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి ల్యాబొరేటరీని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం జరిగిందన్నారు. ఎఫ్ ఎస్ఎస్ఎఐతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి తిరుమలలో ల్యాబొరేటరీ

3 లో..▶

# పేదల సంక్షేమమే ధ్యేయం



(మొదటి పేజీ తరువాయి)

సమున్నత రీతిలో ప్రాధాన్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఆర్థికంగా సామాజికంగా అంతా రాణించాలి అన్న సదుద్దేశంతో, జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు వీలుగా అన్ని వర్గాలకూ సముచిత స్థానం ఇస్తూ పాలన సాగిస్తున్నామని అన్నారు. 75 ఏళ్ల శ్రీకాకుళం జిల్లా ప్రస్థానం ఎంతో గొప్పదని కొనియాడారు. సూపర్ సిక్స్ అమలులో భాగంగా ఆ రోజు ఇచ్చిన ఎన్నికల హామీకి కట్టబడి సామాజిక పింఛను (ఎన్టీఆర్ భరోసా)ను మూడు వేలు నుంచి నాలుగు వేలుకు పెంచామని, తదనుగుణంగా జిల్లాలో 3 లక్షల 12 వేల 550 మందికి లబ్ధిచేకూరుస్తున్నామని, ఇందుకు ప్రతి నెలా 132 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని అన్నారు. దీర్ఘ కాల వ్యాధిగ్రస్తులకు ఆ రోజు ఇచ్చిన పది వేల రూపాయల పింఛనును పదిహేను వేలు చేశామని తెలిపారు. ఇంకా గత ప్రభుత్వం స్పౌజ్ కోటాలో ఇచ్చే పింఛనును నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే 5 వేల 636 మందికి స్పౌజ్ పింఛన్లు అందించింది. దీపం పథకం కింది జిల్లా వ్యాప్తంగా ఆరు లక్షల 92 వేల 825 మంది లబ్ధిదారులుండగా, ఇందుకు 36.41కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాం. స్త్రీ శక్తి అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పంద్రాగస్టు కానుకగా మహిళలంతా ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నాం."

"ఈ సౌకర్యం గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలానే ఉపాధి హామీ పథకం గ్రామీణ రహదారులకు మోక్షం కల్పిస్తూ .. గత ఆర్థిక సంవత్సరంలో రూ.942.64 కోట్లు మంజూరు చేశాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.320.82 కోట్లు మంజూరయ్యాయి. అలానే నాబార్డు నిధులు రూ.26.95 కోట్లు మంజూరు చేశాం. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ దేవాలయాల అభివృద్ధికి రూ.15.55 కోట్లు మంజూరుచేశాం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 2026 కోట్ల పంట రుణాలు మంజూరు చేశాం. వ్యవసాయదారులకు అండగా ఉంటూ పెట్టబడి సాయం కింద ఈ ఏడాది అన్నదాత సుఖీభవ (తొలి విడతగా) 186 కోట్ల రూపాయలు ( కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి) అందించాం. అలానే రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశాం."

"పశు సంరక్షణలో భాగంగా పశువుల బీమా కింద సంకర జాతి ఆవులకు 30వేల రూపాయలు, గొర్రెలు, మేకలకు 6 వేల రూపాయల చొప్పున 351 మందికి బీమా పరిహారం అందించాం. ఉద్యాన వన శాఖకు సంబంధించి రెండు వేల ఐదు వందల హెక్టార్లకు 20.40 కోట్ల రూపాయల రాయితీతో బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించి పరికరాలు అందించాం. మత్స్యకార భరోసా కింద జిల్లాలో 15,548 మంది మత్స్యకారులకు ఇరవై వేల రూపాయల చొప్పున 31 కోట్ల రూపాయలు చెల్లించాం. అలానే చేనేత రంగ సంక్షేమానికి కట్టుబడి సంబంధిత కార్మికలకు నెలకు నాలుగు వేల రూపాయల పింఛనను అందిస్తున్నాం. ఈ సౌకర్యాన్ని 214 మందికి అందిస్తున్నాం. ఇందుకు రెండు కోట్ల 35 లక్షల రూపాయలు వెచ్చింపు. అలానే పవర్ లూమ్ మగ్గం వాడే నేతన్నలకు రెండు వందల యూనిట్లు ఉచితంగా విద్యుత్ ను అందిస్తూ.. సంబంధిత కుటుంబాలకు చేయూత ఇచ్చే విధంగా ప్రభుత్వం తరపున నేతన్నల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కేవిధంగా కృషి చేస్తున్నాం. గత ఖరీఫ్ కు సంబంధించి 635 రైతు సేవా కేంద్రాల ద్వారా లక్షా 13 వేల 861 మంది రైతుల నుంచి ఐదు లక్షల 29 వేల 964 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. తద్వారా 1218 కోట్ల రూపాయలను రైతులకు జమ చేశాం." అలానే ఒన్ ప్రొడక్ట్ - ఒన్ డిస్ట్రిక్ట్ లో భాగంగా పలాస జీడిపప్పుకు కేంద్ర నుంచి గుర్తింపు దక్కడం ఆనందంగా ఉంది." అని పేర్కొన్నారు. స్వతంత్ర సమరయోధులను ఘనంగా సన్మానించిన మంత్రివర్యులు, కార్యక్రమంలో శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సమాజాభ్యున్నతికి కృషి



(మొదటి పేజీ తరువాయి)

మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్స శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ ఆగష్టు 15వతేది ఒక సాధారణమైన రోజు కాదని అది మనకు స్వేచ్ఛను ఇచ్చిన శుభ దినమని పేర్కొన్నారు. ఎందుకంటే బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తి కలిగి కోట్లాది మంది ప్రజల కలలు సాకారమైన రోజని అన్నారు. ఈ స్వేచ్ఛకు మూలం నిరాహార దీక్షలు, ఇరుకైన జైళ్ళ గదుల్లో బందించబడి ఆనేకమంది ప్రాణ త్యాగాల ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవమని చెప్పారు. కావున జాతిపిత మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, అల్లూరి సీతారామ రాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్, మువన్నెల జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వంటి ఎందరో మహనీయుల త్యాగాలను మనం ఎల్లప్పుడూ గుర్తించు కోవాలని అన్నారు. ముఖ్యంగా ఈనాటి యువత స్వాతంత్ర్యయోధ్యమ చరిత్రను తెల్సుకోవాల్సిన అవసరం ఉందని అయ్యన్న పాత్రుడు సూచించారు.

ప్రజాస్వామ్యానికి ప్రాణం సదుపాయాలు కాదని సమర్ధవంతమైన పాలన అని ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ప్రతి ప్రజా సమస్యా సభలో చర్చించబడాలని ప్రతి నూతన విధానం ప్రజల శ్రేయస్సు కోసమే ఉండాలని అదే మన లక్ష్యమని అన్నారు. నేటి యువత స్వాతంత్ర్య పోరాటం గురించి తెల్సుకుని ఆనాటి త్యాగధనులను గుర్తించుకుని దేశానికి సేవ చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికైన అసెంబ్లీ సమావేశాలకు కొంతమంది ఎంఎల్ఏలు హాజరు కావడం లేదని అది వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఇకనైనా ప్రతి సభ్యుడూ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై సభలో చర్చించాలని స్పీకర్ సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సభాపతి కె.రఘురామ కృష్ణ రాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, పలువురు ఉప కార్యదర్శులు, ఇతర అధికారులు, అసెంబ్లీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో సూపర్ హిట్

(మొదటి పేజీ తరువాయి)

వంటి పథకాల గురించి చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో పాటు.. తాను చేసిన తొలి సంతకాల అమలును ముఖ్యమంత్రి వివరించారు. అలాగే ఏపీ బ్రాండ్ గురించి.. పెట్టుబడుల సాధనకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. దీంతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్గాలకు అందించిన సేవలను.. ఆయా రంగాల కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

**వైసీపీ తీరుపై చంద్రబాబు చురకలు :** శాంతి భద్రతలపై ప్రభుత్వ విధానాన్ని ప్రస్తావించిన సందర్భంగా పరోక్షంగా వైసీపీకి చంద్రబాబు చురకలంటించారు. కొందరు రాజకీయ ముసుగులో నేరాలు చేస్తూ.. ప్రోత్సహిస్తున్నారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను వివిధ సందర్భాల్లో చంద్రబాబు ప్రస్తావించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు ప్రతి శాఖలో వెలుగు చూస్తున్నాయని గత పాలకుల తీరును తప్పుపట్టారు. గత ప్రభుత్వం నిలిపేసిన పథకాలను తాము పునరుద్ధరించామనే విషయాన్ని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఆడిన డ్రామాలను గుర్తు చేశారు. గత



ప్రభుత్వం గుంతలతో వదిలేసిన రోడ్ల తీరును ముఖ్యమంత్రి వివరించారు. కొత్త జిల్లాలను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిందని.. ఇప్పుడు వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చెప్పారు. మద్యం, ఇసుక వంటి వాటిల్లో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తావించిన చంద్రబాబు. ఇక ఎస్సీలకు, మైక్రో, డ్రిప్ సబ్సీడీలను గత ప్రభుత్వం నిలిపేసిందని గుర్తు చేయడంతోపాటు.. గతంలో జరిగిన రెవెన్యూ అక్రమాలను సరి చేసి.. పేదల భూములకు రక్షణ కల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు.



**బనకచర్లకు కట్టుబడే ఉన్నాం :** ఇక ఇరిగేషన్ రంగంలో జరిగిన పరిణామాలను వివరిస్తూ.. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు గురించి కీలక ప్రస్తావన చేశారు. వృధాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను వినియోగించుకుంటే.. ఎగువ రాష్ట్రాలకు ఇబ్బంది ఉండదని చెప్పడం ద్వారా బనకచర్ల విషయంలో ప్రభుత్వ విధానాన్ని మరోసారి చంద్రబాబు స్పష్టం చేశారు. వరద వచ్చినప్పుడు కిందకు వదిలేస్తున్న వాళ్లు.. అదే వరద నీటిని వాడుకుంటే అభ్యంతరం చెప్పడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం, బీఆర్ఎస్ పార్టీ బనకచర్ల విషయంలో చేస్తున్న వాదనల నేపథ్యంలో ఏపీ వాదనను.. రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని స్వాతంత్ర్య దినోత్సవ వేదికగా మరోసారి స్పష్టం చేయడం ఆసక్తి పరిణామంగా నిలిచింది. హంద్రీ-నీవా కాల్వల వెడల్పు పనులను రికార్డు స్థాయిలో పని చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూనే.. ఈ ఏడాది ఉత్తరాంధ్ర, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**ప్రధానికి అండగా ఉందాం :** రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని చంద్రబాబు పంద్రాగస్టు ప్రసంగంలో వెల్లడించారు. తాజాగా కేంద్రం ప్రభుత్వం కేటాయించిన సెమీ కండక్టర్ల యూనిట్ గురించి, విశాఖ స్టీల్ ప్లాంట్ కు నిధుల కేటాయింపు వంటి అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. దీంతోపాటు ఇటీవల అమెరికా భారతదేశంపై విధించిన సుంకాల నేపథ్యంలో మన దేశ ఎకానమీ గురించి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మనది డెడ్ ఎకానమీ కాదు.. గుడ్ ఎకానమీ అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. తద్వారా రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు ప్రధానికి అండగా ఉంటామని చంద్రబాబు సంకేతామిచ్చారు. అలాగే ఆపరేషన్ సిందూర్ చేపట్టిన త్రివిధ దళాలకు సీఎం స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై నుంచి సెల్యూట్ చేశారు.

# మహిళలను గౌరవిద్దాం..

- **స్త్రీశక్తితో మహిళలకు మరింత ఆర్థిక వెసలుబాటు**
- **ఇంట్లో మహిళలను గౌరవించని వారు మాపై విమర్శలా?**
- **మహిళలను అవమానించే సీన్లు ఉన్న సినిమాలకు బ్రేక్ వేయాలి**
- **చట్టాలు మాత్రమే సరిపోవు... నైతిక విలువలతోనే మహిళా భద్రత**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా సంక్షేమానికి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ పెద్దపీట వేస్తారు. ఇప్పుడు స్త్రీ శక్తి పథకం ద్వారా ఫ్రీ బస్సు ప్రయాణం ప్రవేశపెట్టారు. ఈ పథకం మహిళలకు మరింత శక్తిని ఇస్తుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ లో స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... స్త్రీశక్తి పథకం వల్ల విద్యార్థినులు, ఉద్యోగాలు చేసుకునే మహిళల పై భారం తగ్గుతుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా నెలకు రూ.1500 భారం తగ్గుతుంది. 2019లో అధికారంలోకి వచ్చిన ఒక రాక్షసుడు మద్యనిషేధం చేస్తానని చెప్పి, విషం కంటే ప్రమాదకర మద్యం అమ్మి మహిళల తాళిబొట్లు తెంచాడు. యువగళం పాదయాత్రలో మీ కష్టాలు చూశాకే సూపర్ -6 పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరాను. గతంలో ఒక తల్లికి ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరిని స్కూల్ కి పంపి, ఇంకొకరిని పనికి పంపాలి అనేది గత ప్రభుత్వం విధానం. ఇప్పుడు చంద్రబాబు గారు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇచ్చారు. 67 లక్షల 27 వేల మందికి 10 వేల కోట్లు ఇచ్చారు. దీపం పథకం ద్వారా 2 కోట్ల సిలెండర్లు ఉచితంగా ఇచ్చారు. సొంత చెల్లెలు రాఖీ కట్టని అన్నలు మహిళా సంక్షేమం గురించి మాట్లాడతారు. సొంత తల్లి, చెల్లి నమ్మని వారు మాపై విమర్శలు చేస్తారు. వారికి నా



సమాధానం ఒక్కటే, ముందు ఇంట్లో ఉన్న మహిళల్ని గౌరవించడం నేర్చుకోండి. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. ప్రభుత్వం మారడం వలన 19 నుండి 24 వరకూ రాష్ట్రం ఎంత నష్టపోయిందో మీరు చూసారు. ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది. కేంద్రం లో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవనన్న నాయకత్వంలో సుపరిపాలనలో తొలి అడుగు పడింది. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలి అంటే ప్రభుత్వ కొనసాగింపు ముఖ్యం.

**టిడిపి ఆవిర్భావంతో మహిళలకు పెద్దపీట :** భూమి కంటే ఎక్కువ భారం మోసేది మహిళ. ఏ రంగం తీసుకున్నా మహిళలే నంబర్ 1. ఆవకాయ్ పట్టాలన్నా మీరే... అంతరిక్షంలోకి వెళ్ళాలి అన్నా మీరే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండే మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చింది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారకరామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 9 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. మహిళల కోసం తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసారు. డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది చంద్రబాబు నాయుడు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు ఇచ్చింది, మహిళా కండక్టర్లను నియమించింది, దీపం పథకం అమలు చేసింది చంద్రబాబు గారు. ప్రతిభా భారతి గారిని తొలి మహిళా స్పీకర్ చేసింది చంద్రబాబు గారే. స్త్రీ శక్తి కి ఎదురులేదు. నేను మంత్రి అయిన తరువాత షైనింగ్ స్టార్స్ అని కార్యక్రమం నిర్వహించాను. టెన్త్, ఇంటర్ లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన వారిని సన్మానించాను. ర్యాంకులు వచ్చిన వారంతా అమ్మాయిలే, వారిని చూసి ఆశ్చర్యపోయాను. 80 శాతం ర్యాంకులు అమ్మాయిలకే వచ్చాయి. అబ్బాయిలు ఎక్కడ ఉన్నారు అని వెదుక్కునే పరిస్థితి వచ్చింది.

**అవకాశాలు కల్పిస్తే అద్భుతంగా రాణింపు :** ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేను మంగళగిరి లో స్త్రీ శక్తి అని ఒక కార్యక్రమం ప్రారంభించాను. మహిళలకు కుట్టు మెషిన్, బ్యూటిషన్ ట్రైనింగ్ ఇచ్చాం. 3623 మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మెషీన్లు అందించాం. ట్రైనింగ్ ఇచ్చి వదిలేయలేదు, వారికి మార్కెట్ లింకేజ్ కూడా ఏర్పాటు చేసాం. జ్యూట్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్ ఇలా అనేక ఐటమ్స్ తయారు చేసి సొంత కాళ్ళ పై నిలబడ్డారు. మహిళలకు అవకాశాలు ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారు. దానికి ఉదాహరణ మా ఇల్లే. కుటుంబం ఆర్థిక అవసరాల కోసం రాజకీయాల పై ఆధారపడకూడదు అని 1992లో చంద్రబాబు హెరిటేజ్ ప్రారంభించారు. రెండేళ్ల తర్వాత బాబు గారు ఫైనాన్స్, రెవిన్యూ మంత్రి అయ్యారు. అమ్మ కంపెనీ చూసుకోవాల్సి వచ్చింది. ఆయన రాజకీయాల్లో బిజీ అయిన తరువాత మా అమ్మ భువనేశ్వరి గారికి వ్యాపార బాధ్యతలు అప్పగించారు. మొదట్లో మా అమ్మ ఆఫీస్ కు వెళ్ళడానికి భయపడేవారు. కొన్ని సార్లు ఆఫీస్ వరకూ వెళ్లి బయటే కార్లో కూర్చున్న రోజులు కూడా ఉన్నాయి. కట్ చేస్తే ఆమె హెరిటేజ్ కంపెనీని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లారు. ఈరోజు 5వేల కోట్ల విలువైన కంపెనీ నడిపిస్తోంది. ఎన్టీఆర్ ట్రస్ట్ ను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్తోంది. పవనన్న 50లక్షల విరాళం ఇచ్చారు. నా భార్య బ్రాహ్మణి స్టాన్ ఫర్డ్ లో చదివింది. నా క్రెడిట్ కార్డు బిల్లు కూడా ఈరోజు ఆమె కడుతుంది. ఇల్లు మొత్తం చూసుకుంటుంది. బసవతారకం డైరక్టర్ గా నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తుంది.

**మహిళలను అగౌరవంగా మాట్లాడొద్దు :** స్త్రీ శక్తి కార్యక్రమం ప్రారంభం సంధర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని మాట్లాడాలి అనుకుంటున్నాను. కొంత మంది మహిళల్ని కించపరుస్తూ మాట్లాడతారు. శాసనసభ సాక్షిగా మా తల్లిని అవమానిస్తే మా తల్లి కోలుకోవడానికి 3నెలలు పట్టింది. చేతికి గాజులు వేసుకున్నావా? అమ్మాయిలా ఏడవకు? అంటూ కొన్ని పదాలు మాట్లాడతారు. అలాంటివి వాడితే నాకు బాధ కలుగుతుంది. అటువంటి వాటికి ఫుల్ స్టాప్ పెట్టాలి. అవన్నీ ఆగాలి. మార్పు ముందు మన ఇంటి నుండి మొదలు అవ్వాలి. అలాంటి మాటలు ఎవరైనా మాట్లాడితే ఇంకోసారి మాట్లాడొద్దని గట్టిగా చెప్పండి. మళ్లీ మాట్లాడితే అన్న లోకేష్ తోలుతీస్తాడని చెప్పండి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారిని ఒక కోరిక కోరుతున్నాను. సినిమాల్లోనూ, వెబ్ సిరీస్ ల్లోనూ మహిళల్ని అవమానపరిచే డైలాగ్స్ బ్యాన్ చెయ్యమని కోరుకుతున్నాను. ఒక వేళ అలాంటి డైలాగ్స్ ఉంటే తీసేసే వరకూ రిలీజ్ ఆపమని, ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతున్నాను. మహిళల భద్రత గురించి అందరూ మాట్లాడతారు. చట్టాలతోనే భద్రత రాదు. ప్రవర్తనలో మార్పు రావాలి. విద్యార్థి దశ నుండి మహిళల్ని గౌరవించడం నేర్పాలి. మార్పు మన ఇంటినుంచే మహిళలను గౌరవించాలి. అందుకే చాగంటి కోటేశ్వరరావు గారు రూపొందించిన నైతిక విలువల పుస్తకాలు పిల్లలకు ఇస్తున్నాం. పాఠ్యపుస్తకాల్లో ఇంటిపనుల ఫోటోలు చెరో సగం ఉండేలా చేశాం. మొన్న జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ లో పిల్లలతో తల్లికి వందనం చేయించామని మంత్రి లోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండి ద్వారకా తిరుమలరావు, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దే రామ్మోహన్, బోండా ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గత శత్రువులను కనిపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశ సుస్థిర మీద సమగ్ర అవగాహన ఉంది. లోపల దేశం అంతర్గత సుస్థిరతను దెబ్బ తీసేవారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. ఈ విషయంలో ప్రతి పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించాల'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, అర్.డబ్ల్యూ.ఎస్, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఉన్న చీకటి రోజులను స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఎదుర్కొన్నామ న్నారు. విభజించు.. పాలించు అన్న బ్రిటీష్ రూల్ ని వారు అమలు చేస్తే.. కూటమి ప్రభుత్వం స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తితో యునైటెడ్ రూల్ అమలు చేస్తోందని తెలిపారు. కలసి పాలన చేస్తూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి-సంక్షేమాలను రెండు కళ్లుగా ముందుకు తీసుకువెళ్తోందని చెప్పారు. కాకినాడలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం సమర్పించారు. జిల్లా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ పరేడ్ ను తిలకించారు. వివిధ శాఖల శకటాల ప్రదర్శన, చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, విన్యాసాలు చూశారు. పవన్ కళ్యాణ్ తో కలసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన ఆయన సతీమణి అనా కొణిదల అతిథుల గ్యాలరీ నుండి ఈ వేడుకలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఉత్తమ సేవా పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరి జీవితాల్లో చీకటి రోజులు వస్తాయి. రాష్ట్రం కూడా 2019 నుండి 2024 వరకు అలాంటి చీకటి రోజులను ఎదుర్కొంది. గత పాలకులు బ్రిటీషర్ల మాదిరిగా రాష్ట్రాన్ని తమ కబంధ హస్తాల్లో పెట్టుకుంటే.. స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఎదుర్కొన్నాం. ఆగస్ట్ 15న ప్రతి ఒక్కరు గుండెల్లోతుల నుంచి దేశభక్తి స్వీకరించాలి. దేశ విభజన సమయంలో లాహెూర్ పాకిస్థాన్ లో అంతర్భాగం అవుతుందని ఎవ్వరికీ తెలియదు. సడెన్ గా లాహెూర్ డిక్లరేషన్ ఇచ్చినప్పుడు మత ప్రాతిపదికన అక్కడ ఉన్న హిందువులను పంపివేసిన సమయంలో ఎన్నో దారుణాలు జరిగాయి. తమది అనుకున్న ప్రాంతం రాత్రికి రాత్రి పరాయి ప్రాంతం అయిపోతే ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోవాల్సి వచ్చింది. స్వాతంత్ర్యం చాలా తేలికగా అహింసా మార్గంలో సాధించుకున్నామని అనుకుంటాం. కానీ స్వాతంత్ర్యం రావడానికి చాలా హింస జరిగింది. మన ఎంపిక విధానాలు అహింసా విధానాలు కావచ్చు. దేశం నుంచి విడిపోవాలి అనుకున్న వారు మాత్రం హింసనే నమ్మారు.

**లౌకికవాదం మన సంస్కృతిలో భాగం:** దేశ విభజన జరిగిన నాటి నుంచి ఆపరేషన్ సింధూర్ వరకు మత ప్రాతిపదికన హింస జరుగుతూనే ఉంది. భారతదేశం తన లౌకికతత్వాన్ని ఎప్పుడూ మర్చిపోలేదు. దేశ విభజన తర్వాత జరిగిన మతానికి సంబంధం లేకుండా భారత దేశ సార్వభౌమత్వాన్ని గౌరవించి లౌకిక వాదాన్ని ముందుకు తీసుకువెళ్లింది. డాక్టర్ అబ్దుల్ కలాం లాంటి వారిని అత్యున్నత పదవిలో కూర్చోబెట్టింది. ఆ పరిస్థితులు పాకిస్తాన్ దేశంలో లేవు. పాకిస్తాన్ లో ఒక హిందూ క్రికెటర్ గా ఉంటే తప్పించుకుంటారు. హిందువుల్లో ఒక బలమైన నాయకుడు కూడా ఆ దేశంలో కనబడదు. మత ప్రాతిపదికన రెండు దేశాలుగా విడిపోయినా, భారత దేశంలో అధిక సంఖ్యలో ఉన్న హిందువులు ఉన్నా అన్ని మతాల వారిని గౌరవించి ముందుకు తీసుకువెళ్లే సంస్కృతి మనది. లౌకిక అనేది భారత దేశ సంస్కృతిలోనే ఉంది. ఆ సంస్కృతిని పరాయివారు, యూరోపియన్లు మనకు నేర్పించవలసిన అవసరం లేదు. ఈ స్ఫూర్తిని మనమంతా ముందుకు తీసుకెళ్లాలి. మహిళలు చేసిన త్యాగాలకు పెద్ద పీట వేసి ఆ స్ఫూర్తిని మేము ముందుకు తీసుకువెళ్తాం.

**అంతర్గత సుస్థిరతను దెబ్బతీసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి..:** అవినీతి ఉన్న చోట దేశం బలహీనపడుతుంది. అలాంటి పరిస్థితులు ఉండకూడదనే మేము ప్రయత్నం చేస్తున్నాం. ప్రజలు ఎరుకతో నిరంతరం పహారా కాస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. మన దేశాన్ని మనం రక్షించుకోవాలంటే ప్రజలంతా నిరంతర పహారా మనస్తత్వం కలిగి ఉండాలి. కశ్మీర్ లో సింధూర్ ఆపరేషన్ కి మనకి సంబంధం ఏంటి అనుకోకూడదు. పెహల్గాంలో విశాఖకు చెందిన వ్యక్తిని, కావలికి చెందిన వ్యక్తిని ఉగ్రవాదులు చంపేశారు. దానికి బలంగా బదులిచ్చాం. అయితే లోపల దేశంలో అంతర్గత సుస్థితరతను దెబ్బతీసే వారిపై కూడా మనమంతా దృష్టి సారించాలి. ప్రతిసారి పోలీసు అధికారుల పేరు చెప్పేకంటే ఇది ప్రతి పౌరుడి బాధ్యత అని నేను అంటాను. నేను నా వంతు బాధ్యత వహిస్తాను. ప్రజలు వారు నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**మేము సద్విమర్శను స్వీకరిస్తాం...:** 2019 నుండి 2024 మధ్య ప్రజలంతా చూశారు. ఒక్కో సందర్భంలో రోడ్డు మీదకు రావాలంటేనే భయాలు ఉండేవి. ప్రభుత్వాన్ని తిట్టేందుకు ఎవరూ భయపడడం లేదు. మేము ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తాం. కూటమి పాలనలో సద్విమర్శను స్వీకరించే పరిస్థితులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో విమర్శ చేయాలన్నా భయపడే వారు. పోలీసు అధికారులు డ్యూటీ చేయడానికి భయపడే వారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచేసుకున్నారు. ఇలాంటి పరిస్థితులు విదేశీ శక్తులకు ఆలవాలంగా మారతాయి. 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భంగా నేను



కోరేది ఒకటే. అంతర్గత శత్రువులను ఒక కంట కనిపెట్టాలి.

**డీజిల్ దగ్గర వదిలేస్తే.. వెపన్స్ వరకూ పాకొచ్చు..:** కాకినాడ పోర్టు విషయంలో గొంతు ఎత్తడానికి కారణం. రాష్ట్రానికి 974 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఇది రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకువస్తుంది. ఒక్కోసారి అదే బలహీనత కూడా అయిపోతుంది. ముంబైలో దాడులకు పాల్పడిన ముష్కరులు ఏ మాత్రం పర్యవేక్షణ లేని పోర్టుల నుంచే వచ్చేశారు. ఆర్డీఎక్స్ లు ఆ పోర్టుల నుంచే వచ్చేశాయి. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంపై పోలీస్ శాఖ బలంగా దృష్టి పెట్టాలి. పెడుతుంది కూడా. కాకినాడ పోర్టులో అక్రమంగా డీజిల్ రవాణా జరుగుతోంది. దీన్ని బలంగా అడ్డుకోవాలి. ఒకసారి డీజిలే కదా అని వదిలేస్తే.. తర్వాత వెపన్స్, బాంబులు తెచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వానికి లా అండ్ ఆర్డర్, దేశం కూటమి తాలూకు సుస్థిరత మీద సమగ్ర అవగాహన ఉంది. అవినీతి ఉన్న చోట దేశం బలహీనపడుతుంది. అలాంటి పరిస్థితులు ఉండకూడదని ప్రయత్నిస్తున్నాం.

## మార్పు మనసుంచే రావాలి



(మొదటి పేజీ తరువాయి)

దేశమంతా కలిసి చేసుకునే ఒకే ఒక్క పండుగ జెండా పండుగ. జెండా పండుగ నాకు ఒక ఎమోషన్. ఇండిపెండెన్స్ డే అనగానే నాకు నా స్కూల్ డేస్ గుర్తొస్తాయి. ఇండిపెండెన్స్ డే వస్తుంది అంటే ఒక హడావిడి ఉండేది. ఫ్రెండ్స్ అంతా కలిసి స్కూల్ ను డెకరేట్ చేసే వాళ్ళం. స్కూల్ లో పెట్టే కాంపిటీషన్స్ కోసం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర గురించి తెలుసుకునే వాళ్ళం. ఫైనల్ గా ఎవరైనా గెస్ట్ వచ్చి జెండా ఎగరేసినప్పుడు గూస్ బమ్స్ వచ్చేవి. ఆ మూమెంట్ ఈ రోజు మళ్ళీ నాకు గుర్తొచ్చింది. ప్రపంచంలో ఒకే ఒక్క పవర్ ఫుల్ వెపన్ ఉంది. ఇతర ఏ వెపన్స్ చెయ్యలేని పని ఆ వెపన్ చేస్తుంది. ఆ వెపన్ పేరే అహింస. ఆ వెపన్ మనకు ఇచ్చిన గొప్ప వ్యక్తి గాంధీ తాత. అహింస, సత్యం, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం అనే సిద్ధాంతాలతో స్వాత్రంత్ర్యం సాధించారు.

**తెలుగునేలది ప్రత్యేక చరిత్ర** : స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో తెలుగు నేల కు ప్రత్యేక చరిత్ర ఉంది. బ్రిటిష్ వాడి తుపాకీకి గుండె చూపిన యోధుడు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు. జాతీయ జెండాను పింగళి వెంకయ్య రూపొందించారు. "మాకొద్దీ తెల్లదొరతనం" అని నినదించారు గరిమెళ్ల సత్యనారాయణ. అమరజీవి పొట్టి శ్రీరాములు లాంటి ఎంతో మంది దేశభక్తులు, స్వాతంత్ర్యం సమరయోధులు మన తెలుగు నేలపైనే పుట్టారు. మన సమరయోధుల ఘనకీర్తి దేశానికి తెలిసేలా చేద్దాం. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేద్దాం. గుంటూరు జిల్లాలో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మన జిల్లాలోని పెదనందిపాడులో సహాయ నిరాకరణ ఉద్యమం జరిగింది. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా గుంటూరు, తెనాలిలో ఆందోళనలు జరిగాయి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని తెనాలికి చెందిన ఏడుగురు ప్రాణ త్యాగం చేసారు. మంగళగిరిలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, ఆనాటి ఘట్టాలను గుర్తు చేస్తూ ఒక మ్యూజియంను ఏర్పాటు చేయబోతున్నాం.

**స్వాతంత్రోద్యమంలో చెరగని ముద్ర** : స్వతంత్ర పోరాటంలో గుంటూరు నేలది చెరగని ముద్ర. మన జిల్లాకు చెందిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కన్నెగంటి హనుమంతు, పర్వతనేని వీరయ్య చౌదరి, తమనంపల్లి అమృతరావు వంటి ఎంతోమంది దేశభక్తులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. వారందరి సేవలను మనం గుర్తు చేసుకోవాలి. కులం, మతం, ప్రాంతం కంటే దేశం గొప్పది. అందరిలోనూ దేశ భక్తి ఉండాలి. దేశం కోసం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఒక్కటి అవ్వాలి. ఈ సందర్భంగా పెహల్గామ్ ఉగ్రవాద దాడి గురించి మాట్లాడుకోవాలి. పాకిస్థాన్ ఉగ్రవాదులు పెహల్గామ్ లో దాడులు చేసి 26 మంది అమాయకుల్ని చంపేసారు. గత ప్రభుత్వాల మాదిరి మనం కన్నీరు పెట్టుకొని ఇతర దేశాల సహాయం కోసం వెళ్ళలేదు. మన దేశ పవర్ ఫుల్ మిస్సైల్ మన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారు పాకిస్తాన్ కి సరైన శిక్ష వేసారు. ఆపరేషన్ సిందూర్ తో మన పవర్ ఏంటో ప్రపంచానికి తెలియజేసారు. ఆపరేషన్ సిందూర్ జరిగేప్పుడు కొంతమంది సైనికులను కూడా మనం కోల్పోయాం. అందులో మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్ ను కూడా కోల్పోయాం. మురళీ నాయక్ తల్లితండ్రిని నేను కలిసాను. వారికి ఒక్కడే కొడుకు. మురళి నాయక్ సైన్యం లోకి వెళ్లడం వారికి ఇష్టం లేదు. మురళి నాయక్ ను ఆర్మీ కి వెళ్లొద్దు, నీకు ఏమైనా అయితే మేము తట్టుకోలేం అన్నారు. అప్పుడు మురళి నాయక్ ఒక్కటే చెప్పాడు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, డిఐజి సర్వశ్రేష్ఠి త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నజీరుద్దీన్, తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 'స్త్రీ శక్తి'కి ఎదురులేదు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : సూపర్ సిక్స్ లో భాగంగా కూటమి ప్రభుత్వం మరో హామీ స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం అత్యంత వేడుకగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తదితర నాయకులు ఉండవల్లి నుంచి మహిళలతో బస్సులో ప్రయాణిస్తూ వారితో కొద్దిసేపు ముచ్చటించారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ముందుగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్త్రీ శక్తి పథకం మహిళా లోకానికి మరో నవశకమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్న హామీ అమలుపై సీఎం చంద్రబాబు తో చర్చించిన సమయంలో నేను రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసానికి గురైన ఈ సమయంలో ఫ్రీ బస్సు హామీ నెరవేర్చగలమా అన్న సందేహం వ్యక్తం చేశాను. కానీ చంద్రబాబు కు ఉన్న అపార అనుభవమే స్త్రీ శక్తి పథకం అమల్లోకి రావడానికి కారణంగా నిలుస్తుందన్నారు. స్వాతంత్రదినోత్సవం నాడే స్త్రీ శక్తి పథకం అమలు చేయడం శుభపరిణామం అన్నారు. స్త్రీ శక్తికి సముచిత స్థానం ఇస్తూ, మహిళా సాధికారత దిశగా మరో అడుగు ముందుకు వేస్తూ ప్రతి ఆడపడుచుకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నేటి నుంచి రాష్ట్రానికి చెందిన బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్ లకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం చేయడానికి ఏటా రూ. 2వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ అస్థవ్యస్థ విధానాలతో కుదేలైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ, మరో వైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరుస్తూ, ఇంకో వైపు సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కో హామీని చాలా బలంగా ముందుకు తీసుకువెళుతున్నారు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి విద్యార్థి తల్లికి తల్లికి వందనం పథకం అమలు చేశామన్నారు. అలాగే దీపం-2 పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయడానికి 8,458 బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఐదు రకాల బస్సుల్లో గుర్తింపు కార్డు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. జీరో ఫేర్ టికెట్ తో ఉచితంగా రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రతి బస్సులో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయడంతో పాటు మహిళా కండక్టర్ వద్ద ఒక కెమేరా ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను బస్సులో ఉండవల్లి నుంచి ప్రయాణిస్తూ మహిళలతో ముచ్చటిస్తే, ఒక్కొక్కరూ తమకు నెలకు కనీసం వెయ్యి నుంచి రెండు వేల వరకు ఆదా అవుతుందని తెలిపారన్నారు. విద్యార్థనీలు నెలకు రూ. 1500 ఆదా అవుతుందని వివరించారన్నారు. ఒక్కో మహిళ నెలకు కనీసం రూ. 2వేలు పొదుపు చేయగలగడం గొప్ప విషయమన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్పతనమే అని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పెట్టుబడులు ఆకర్షించగలుగుతున్నామంటే మీరు మాపై పెట్టిన నమ్మకమని అందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

శాసనసభ సభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 1995 వ సంవత్సరంలో ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి ఇప్పటివరకు ఎలాంటి కార్యక్రమం చేపట్టిన అది ఖచ్చితంగా మహిళల సంక్షేమం కోసమే చేపట్టారన్నారు. 1995 లో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రతి ఊరు ప్రతి పల్లె తిరిగి మహిళలను చైతన్య పరిచి డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి, ఒక గొప్ప వ్యవస్థను మహిళలకు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రిదన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆలోచించిన వ్యక్తి, ఇంటికి మహిళే రారాజు అని వారికి పెద్ద పీట వేసిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అని అన్నారు. మహిళల పేరు మీద ఇంటి పట్టాలు, మహిళలకు దీపం మరియు దీపం 2.0 ద్వారా గ్యాస్ కనెక్షన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను మొదలు పెట్టింది నారా చంద్రబాబు నాయుడుగానే అని తెలిపారు. ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కొక్కటి అమలు చేస్తూ వాటిలో కీలకమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ను నేడు ప్రారంభించుకోవడం గర్వకారణమన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కొక్కటి అమల్లోకి తీసుకువస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి వర్గ సభ్యులకు, శాసన సభ్యులకు, అధికారులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే రూ. 3వేల పింఛన్ రూ. 4వేలకు పెంచడం, పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టే అన్నా క్యాంటిన్లు



ప్రారంభించడం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం, తల్లికి వందనం పథకంలో భాగంగా ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి ఆర్థిక సాయం తల్లి ఎకౌంట్ లో జమ చేయడం అమలు చేశారన్నారు. ఇక నేడు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయాలన్నా టికెట్టు లేకుండ ప్రయాణించే అవకాశం కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన, మైనార్టీ, మహిళల ప్రభుత్వమని అన్నారు. ఆర్థిక లోటుపాట్లు, అప్పులు, సమస్యలు ఉన్నా ఈ కష్ట సమయంలో కూడా హామీలు నెరవేర్చుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. బిజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రజల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలనే దృక్పదంతో ముఖ్యమంత్రి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాడన్నారు. ఫ్రీ బస్సు పథకం మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఎంఎల్సీ పంచుమర్తి అనురాధ, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలనాథ్, ఎన్టీయార్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి'తో మహిళలకు మేలు



(మొదటి పేజీ తరువాయి)

వరకు ప్రయాణించారు. దారి పొడవునా వివిధ బస్ స్టాప్ లలో ప్రజలు, ప్రత్యేకించి మహిళలు స్వాగతం పలికారు. బస్సుల్లో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లతో కరచాలనం చేసేందుకు బస్ వెంబడి పరుగులు పెట్టారు. బస్సులో ప్రయాణిస్తున్నంత సేపు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ మహిళలతో మాట్లాడారు. వాళ్ల స్థితిగతులతో పాటు.. ఉచిత బస్ ప్రయాణం వల్ల ఎంత వరకు మేలు కలుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయవాడ బస్టాండ్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

**ఆడబిడ్డలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం** : 'ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం. ఒకప్పుడు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కొన్ని సీట్లు రిజర్వ్ విధానం చేశాం. ఇప్పుడు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నాను. ఇకపై ప్రతి ఆడబిడ్డ ఉచిత బస్సు ప్రయాణం చేయొచ్చు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లొచ్చు. మిత్రుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాను. దారి పొడవునా పలువురు మహిళలతో మాట్లాడాను. వారి మాటలు విన్న తర్వాత ఆడబిడ్డలకు మంచి చేశామన్న తృప్తి కలిగింది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**అన్నగా ఇస్తున్న వరం** : 'ఉచిత బస్సు ప్రయాణం ఆడబిడ్డలకు అన్నగా నేను ఇస్తున్న వరం. రాష్ట్రంలోని 2.62 కోట్ల మంది మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుంది. ఈ పథకం అమలుకు నెలకు రూ.162 కోట్లు, ఏడాదికిరూ.1,942 కోట్లు వ్యయం చేస్తున్నాం. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డనరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులలో ఏ బస్సు ఎక్కినా ఎంత దూరం వెళ్లినా ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదు. రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీ ప్రస్తుతం 11,449 బస్సులు నిర్వహిస్తుండగా అందులో మహిళలు 8,458 బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలు కల్పించాం. స్త్రీ శక్తి పథకం ద్వారా 74 శాతం బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. ప్రతీ తల్లీ అత్తింటిలోని తన కూతుర్ని ఉచిత బస్సులో వెళ్లి చూసి రావొచ్చు. ప్రతీ కోడలూ, అత్తతో కలిసి ఉచిత బస్సులో మార్కెట్‌కు వెళ్లి రావొచ్చు. ప్రతి మహిళా, ప్రతి యువతీ ఉద్యోగానికి, విధులకు ఛార్జీ లేకుండా వెళ్లవచ్చు. వృద్దులు హాయిగా దేవాలయాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లవచ్చు. చిరు వ్యాపారులు వారి ఉత్పత్తులకు డిమాండ్ ఉన్న ప్రాంతానికి వెళ్లి మంచి ధరకు అమ్ముకోవచ్చు. నరేగా పనులకు, కూలీ పనులకు వెళ్లే మహిళలు తమ ఉపాధి కోసం ఉచిత ప్రయాణం చేసి డబ్బు ఆదా చేయొచ్చు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**మహిళలకు ఆర్థిక భరోసా** : 'ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుంది. ఉపాధి కోసం ఒక ఊరు నుంచి ఇంకో ఊరుకు వెళ్లి వ్యాపారం చేసుకునే మహిళలకు ఈ పథకం ఎంతో అండగా ఉంటుంది. ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ కోసం పట్టణాలకు వెళ్లే వారికి పథకం నిజమైన ఆర్థిక శక్తిగా ఉంటుంది. బస్సులో ప్రయాణించే మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళున్నారు, టిక్కెట్ ధర ఎంత? రాయితీ ఎంత ఇస్తున్నామనే వివరాలతో టిక్కెట్ ఇస్తారు. టిక్కెట్ ధర ఎంత ఉన్నా 100 శాతం రాయితీ కల్పిస్తున్నాం. ఈ పోస్ మిషన్ ద్వారా మహిళలకు 'జీరో ఫేర్ టిక్కెట్' వస్తుంది. మీ ప్రయాణ వివరాలు తెలిపేందుకే మాత్రమే ఈ టిక్కెట్ ఇస్తున్నాం. బస్సులో ఎలాంటి ఛార్జీ వసూలు చేయరు' అని సీఎం స్పష్టం చేశారు.

'ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఆర్టీసీ సామర్థ్యాన్ని పెంచుతున్నాం. రాష్ట్రంలోని 129 డిపోలు, 423 బస్ స్టేషన్లు, 4 జోనల్ వర్క్‌షాపులు... ఇలా మొత్తం వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. ఇకపై బస్ స్టార్ట్ అయిన తర్వాత నుంచి గమ్యం చేరేవరకు బ్రేక్‌డౌన్‌లు తలెత్తవు. స్త్రీశక్తి అమలుపై ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి తగ్గట్టు పథకాన్ని మెరుగుపరుస్తాం. బస్ స్టేషన్లు అత్యంత పరిశుభ్రంగా ఉంచుతున్నాం. పీఎం-ఈ బస్ సేవా పథకం కింద 11 ప్రధాన నగరాల్లో త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తెస్తున్నాం. పార్సిల్ సర్వీస్ ద్వారా అధిక ఆదాయం తెస్తున్నాం. డోర్ డెలివరీ, డోర్ పికప్ సర్వీసులు పెంచుతాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఒత్తిడి ఉన్నా... అతిథుల్లా చూడండి** : 'మహిళా భద్రత దృష్ట్యా ప్రతీ బస్సులో జీపీఎస్ అమర్చాం. బస్సు ఏ రూట్లో ఎటు వెళ్తుంది అనేది రియల్ టైమ్ ట్రాక్ చేస్తాం. ఇకపై ఏ బస్సు కొన్నా ఎలక్ట్రికల్ బస్సులే, ఏసీ బస్సులే కొంటాం. ఆర్టీసీకి ఆదాయ మార్గాలు కూడా అన్వేషిస్తున్నాం. అలాగే ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుని వారికి న్యాయం చేస్తాం. ఈ సందర్భంగా ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్లను, కండక్టర్లను ఉద్యోగులను, అధికారులను నేను ఒకటే కోరుతున్నాను. కొత్త పథకాల అమలు సమయంలో ఉద్యోగులపైనా కొంత ఒత్తిడి ఉంటుంది. ఎంత పని ఒత్తిడి ఉన్నా మహిళలను అతిథుల్లా చూడాలి' అని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

**ఇక్కడున్నది 1995 నాటి సీబీఎన్** : 'నేను ఏ పని తలపెట్టినా యజ్ఞంలా చేస్తున్నాను. కానీ కొందరు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడితే రాజకీయ లబ్ధి కోసం విషం చిమ్ముతున్నారు. అమరావతిని స్మశానం, ఎడారి అన్నారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రభుత్వం మీ అందరి ప్రభుత్వం. మీకు అండగా ఉండే ప్రభుత్వం. ఇటీవల పులివెందులలో జడ్పీటీసీ ఎన్నిక జరిగింది. 30 ఏళ్ల తర్వాత ఓటేశాను, అందరికీ దండాలు అని బ్యాలెట్‌లో ఓ వ్యక్తి రాశాడు. అంటే వారికి 30 ఏళ్లుగా ఓటు హక్కును వినియోగించుకోలేదు. మా వివేకా సార్‌కు న్యాయం చేయండని మరో వ్యక్తి కోరుతూ బ్యాలెట్‌లో స్లిప్ రాసి వేశారు. కొందరు కరుడు కట్టిన నేరస్థులు రాజకీయ ముసుగులో వచ్చి సమాజాన్ని అతలాకుతలం చేయాలనుకుంటున్నారు. వాటి ఆటలు సాగనివ్వను. ఇక్కడున్నది 2025 సీఎం కాదు... 1995 నాటి సీఎం' చంద్రబాబు హెచ్చరించారు.


**మహిళాభ్యున్నతికి తొలి ప్రాధాన్యత** : ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు. ఆడబిడ్డలు చదువుకోవాలని తిరుపతిలో మహిళా విశ్వ విద్యాలయం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల్లో 9 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నేను రాజకీయాల్లో, ఉద్యోగాల్లో, కళాశాలల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాను. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం కోసం డ్వాక్రా తెచ్చాను. ఆర్టీసీ కండక్టర్లుగా మహిళలను పెట్టాం. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లుగా



మహిళలను పెడతాం. నేనెప్పుడూ మహిళా సాధికారతను కోరుకుంటాను. 4వ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలకు రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తున్నాం. ఎంఎస్ఎంఈలతో మహిళలను పారిశ్రామిక వేత్తలను చేస్తున్నాం. రాబోయే రోజుల్లో డ్వాక్రా, మెప్మా సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేస్తాం. ఎన్డీఏ అధికారంలోకి రాగానే ఈగల్ వ్యవస్థ తెచ్చి గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేశాం. ఇంట్లో మహిళలను అవమానిస్తే ఎంత బాధగా ఉంటుందో నాకూ, మిత్రుడు పవన్ కల్యాణ్‌కు తెలుసు. మహిళలను ఎవరైనా అవమానకరంగా మాట్లాడితే వదిలిపెట్టం' అని హెచ్చరించారు.

**ఈ నెలాఖరుకు డీఎస్సీ పోస్టులు భర్తీ** : '64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నాం. ఇందుకోసం ఏడాదికి రూ.33,000 కోట్లు ఖర్చు పెడుతున్నాం. గత పాలకులకు రూ.2,000 పింఛను రూ.3000 చేయడానికి ఐదేళ్లు పట్టింది. తల్లికి వందనం పథకంతో రూ.10 వేల కోట్లతో ఒక్కో విద్యార్థికి రూ.15,000 చొప్పున 67 లక్షల మంది విద్యార్థులకు ఇచ్చాం. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతీ రైతుకు మొదటి విడతగా రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశాం. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించాం. కట్టెల పొయ్యి దగ్గర నా తల్లి పడిన కష్టం మరే ఆడబిడ్డ పడకూడదని దీపం పథకం తెచ్చాను. దీపం 2 పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఈ ఆగస్టు నెలాఖరుకు 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. గత ఐదేళ్లు ప్రజలను వేధించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. 204 అన్నా క్యాంటిన్ల ద్వారా 5.16 కోట్ల మందికి రూ.5 లకే కడుపు నింపాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం



(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్ల పనుల్ని గత ఏప్రిల్ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. తిరుమలలోని పిండి మిల్లు వద్ద అక్కడి అధికారులు అందజేసిన భవనాన్ని(12,000 చదరపు అడుగులు) ల్యాబొరేటరీ ఏర్పాటుకు అనుగుణంగా మారుస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.19 కోట్ల వ్యయం చేసే ఆహార నమూల పరీక్షలు చేసేందుకు గాను యంత్రపరికరాలను ల్యాబొరేటరీలో సమకూరుస్తున్నామని చెప్పారు. ఈ ల్యాబొరేటరీలో అన్ని రకాల ఆహార పదార్ధాల నమూనాలను పరీక్షిస్తారన్నారు. 24గంటల పాటు ఈ ల్యాబబొరేటరీ పనిచేసేలా అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. దేశవిదేశాల నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈ కేంద్రం పనిచేస్తుందని మంత్రి తెలిపారు.

ఇప్పటి వరకు ఆహార పదార్థాల నాణ్యతా పరీక్షల నిమిత్తం పొరుగు రాష్ట్రాలకు నమూనాలు పంపిస్తున్నారన్నారు. సిబ్బందికి నమూనాల పరీక్షలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తిరుమల ఆహార పదార్థాల తయారీకి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చే నిత్యావసర వస్తువుల(పాలు, పెరుగు వగైరా) నమూనాలను ఈ కేంద్రంలో పరీక్షించి నాణ్యత ఉన్నట్లు నిర్ధారణ జరిగిన తర్వాతే వాటిని వినియోగిస్తారని చెప్పారు.

విశాఖపట్నంలోని రాష్ట్ర స్థాయి ఫుడ్ ల్యాబొరేటరీ కూడా వచ్చే నెలలో ప్రారంభం కానుందని, ఇందులో అవసరమైన అన్ని రకాల యంత్రపరికరాల్ని అందుబాటులోకి తీసుకొచ్చే పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు.


**గుంటూరు, తిరుపతి, కర్నూలులోనూ...** : గుంటూరు జీజీహెచ్‌లో అలాగే తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఫుడ్ ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కర్నూలులో ఇప్పటికే ప్రాంతీయ ఫుడ్ ల్యాబొరేటరీ ఉందన్నారు. దీని స్థాయిని పెంచి కొత్తగా భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. దీనికోసం స్థలాన్వేషణ జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టర్లు పనులు మొదలు పెడతారని చెప్పారు.

**రూ.13 కోట్లతో ఒంగోలు, ఏలూరు ల్యాబ్‌ల ఉన్నతీకరణ** : ఒంగోలు, ఏలూరులో ఉన్న పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను ఉన్నతీకరణిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఇప్పటికే నడుస్తున్న ల్యాబుల్లో సుమారు రూ.13 కోట్ల వ్యయంతో అత్యాధునిక పరికరాల్ని సమకూరుస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి పరికరాల కొనుగోలుకు పర్చేజింగ్ ఆర్డర్ కూడా ఇచ్చామని మంత్రి చెప్పారు.

# రాష్ట్రానికి జీవనాడి పోలవరం

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతపై మనందరిపై ఉందన్నారు. వారి కలలను సాకారం చేసేందుకు మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేసిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలనను అందిస్తున్నదన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటినుండి తిరిగి పోలవరం పనులు పునర్జీవం పొందాయన్నారు. నదుల అనుసంధానంలో కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం ధృడ సంకల్పంతో ముందుకు వెళుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టామన్నారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్నామన్నారు. జీరో పావర్టీ కోసం అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. పేదరికం లేని సమాజం కూటమి ప్రభుత్వ విధానమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం పీ4 కార్యక్రమం ద్వారా వెనుకబడిన కుటుంబాలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ఏలూరు జిల్లాలో 75 వేల 871 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, ఇప్పటివరకు 68 వేల 268 కుటుంబాలను 7వేల 675 మార్గదర్శకులతో దత్తత తీసుకున్నామన్నారు. జిల్లాలో అన్నదాతా సుఖీభవ.. పీ. ఎం. కిసాన్ పథకం కింద 1, 60, 968 రైతు కుటుంబాలకు రూ. 107. 58 కోట్లు పెట్టుబడి సాయంగా రైతులకు విడుదల చేశామన్నారు. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 65 వేల 147 మంది కౌలు రైతులకు సిసిఆర్సీ కార్డులు అందించామన్నారు. అందులో ఇంతవరకు 23 వేల 274 మంది కౌలు రైతులకు రూ. 143 కోట్లు రుణాలను బ్యాంకుల ద్వారా అందించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 49 వేల 168 మంది కౌలు రైతులకు సిసిఆర్సీ కార్డులు అందించామన్నారు. 2024 ఆగష్టు, సెప్టెంబర్ మాసాల్లో కురిసిన అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకుగాను 5 వేల 891 మంది రైతులకు రూ. 7. 02 కోట్లు పంట నష్ట పరిహారాన్ని అందించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన శాఖ ద్వారా వివిధ పథకాల కింద 15 వేల 583 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేశామన్నారు. బిందు, తుంపర సేద్యం ద్వారా ఇప్పటివరకు 6223 మంది రైతులకు రూ. 29. 80 కోట్లు అందించామన్నారు. జలవనరుల శాఖ ద్వారా ఓ అండ్ ఎం యాక్షన్ ప్లాన్ లో రూ. 9. 11 కోట్లతో కాలువలు, డ్రైన్లలో తూడు తొలగించామన్నారు. జపాన్ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో తమ్మిలేరు ప్రాజెక్ట్ ఆధునికీకరణకు 16 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ పనులు 93 శాతం పూర్తి చేయడమే కాకుండా కృష్ణా డెల్టా ఆయకట్టును సంరక్షించేందుకు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 442 టీఎంసీ ల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్ళించామన్నారు. జిల్లాలో 258 కోట్ల రూపాయలతో 158 రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి, ఇంతవరకు 129 పనులు పూర్తిచేశామన్నారు. కొత్తగా 69 కోట్ల రూపాయలతో 40 రహదారి మరమ్మత్తులు పనులు చేపడుతున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాసయోజన. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో నిరుపేదలకు లక్షా 02 వేల 237 గృహాలను రూ. 1840 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామన్నారు. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బిసి., పివీటిజి లకు మంజూరైన యూనిట్ విలువ రూ. 1. 80 లక్షలకు అదనంగా బిసి., ఎస్సీ లకు 50 వేల రూపాయలు, ఎస్టీ లకు 75 వేల రూపాయలు, పివీటిజి



లకు లక్ష రూపాయలు అదనంగా సబ్సిడీ అందిస్తున్నామన్నారు. ఇప్పటికే 4 వేల 766 మంది లబ్దిదారులకు రూ. 9. 68 కోట్లు అందజేశామన్నారు. లే అవుట్లలో స్థలాల మెరక , రహదారులు, విద్యుత్, కల్వర్టుల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలను రూ. 44. 74 కోట్ల రూపాయలతో పూర్తిచేశామన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులకు 3 కిలోవాట్ల వరకు సోలార్ ప్యానళ్లు ఏర్పాటుకోసం 78 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి0, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.పీఎస్.. కిషోర్, జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖ జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# సూపర్‌సిక్స్‌లో మరోఅడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోమువీర్రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తదితరులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా స్వయంగా టికెట్ కొనుక్కున్న మంత్రి దుర్గేష్ తోటి మహిళా ప్రయాణీకులతో మాట్లాడారు. మహిళలకు ఇచ్చే తొలి జీరో ఫేర్ టికెట్ ను తన చేతుల మీదుగా అందించారు. పథకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆద్యంతం ఆనందోత్సవాల మధ్య గడిపారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు ప్రయాణం చేసే బాలికలు, మహిళలు, యువతులు, ట్రాన్స్ జెండర్లు ఆధార్ కార్డు, ఓటర్ కార్డు మరేదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుందని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం కోసం దాదాపు 186 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. తద్వారా 56 వేల కి.మీల పైచిలుకు ప్రయాణం చేయడానికి అవకాశముందన్నారు. సూపర్ లగ్జరీ, నాన్ స్టాప్ బస్సులు మినహా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ తదితర 5 కేటగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అంతేగాక ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఏపీ ఎన్ క్లేవ్ బస్సుల్లో కూడా ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చన్నారు. ఇది గొప్ప విషయమన్నారు. తద్వారా తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ తదితర రాష్ట్రాలకు తరుచూ వెళ్లే ఏపీలోని సరిహద్దు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నామన్నారు. మహిళలు మాత్రమే కాకుండా ట్రాన్స్ జెండర్లకు సైతం ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం విప్లవాత్మక చర్యగా భావిస్తున్నామన్నారు. సమాజంలో సరైన ఆదరణకు నోచుకోని ట్రాన్స్ జెండర్ల సమస్యలను సైతం గుర్తించి వారికి చేదోడు వాదోడుగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ పథకంలో వారిని భాగస్వామ్యులను చేయడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నారని ఈ క్రమంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకం లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ప్రారంభించామని మంత్రి దుర్గేష్ వివరించారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించి మహిళా ప్రయాణీకులతో కలిసి ప్రయాణం చేశారని తెలిపారు. మహిళలు దూరాభారం, ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రయాణం చేయలేని పరిస్థితుల్లో వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారి పథకం ప్రారంభించామన్నారు.

మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.1500, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు సైతం కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికల హామీల్లో భాగంగా ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు, దీపం-2 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మెగా డీఎస్సీ అమలు చేశామని వెల్లడించారు. అంతేగాక గత ప్రభుత్వ ధాన్యపు బకాయిలను సైతం విడుదల చేశామని గుర్తుచేశారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు మంచి చేయడమే తెలిసిన ప్రభుత్వమని పేర్కొన్నారు.

పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని స్పష్టమైందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేసినందుకు సీఎం,డిప్యూటీ సీఎంలకు మంత్రి దుర్గేష్, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

**సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది:రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు :** రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసి సూపర్ హిట్ చేసి చూపించిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంచామన్నారు. తల్లికి వందనం క్రింద కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి పథకం వర్తింపజేశామని గర్వంగా తెలియజేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ క్రింద తొలి విడతగా రూ.7 వేలు అందించామన్నారు. దీపం-2 పథకం క్రింద మహిళలకు రెండు విడతల్లో రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, కూటమి ప్రజాప్రతినిధులు స్త్రీశక్తిలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ఆయా ప్రాంతాల్లో అధికారికంగా ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు పండుగ వాతావరణంలో బస్సు ప్రయాణం చేస్తున్నారన్నారు. ఈ పథకం అమలు చేసే అవకాశం లేదన్న వైకాపా నేతలకు తొలి ఏడాదిలోనే అమలు చేసి బుద్ధి చెప్పామన్నారు. ఇప్పటికే 90 శాతం హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ, జిల్లా ప్రజా రవాణాధికారి వైఎస్ఎం మూర్తి, డిపో మేనేజర్ కె.మాధవ్, ప్రజా రవాణా అధికారులు, స్థానిక నేతలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు పోలీస్ బలగాల కవాతు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పోలీస్ బలగాల కవాతు ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్‌కు, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో, జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు పర్యవేక్షణలో, పోలీస్ పరేడ్ కమాండర్ ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి నేతృత్వంలో గౌరవ వందనం సమర్పించారు.

జాతీయ గీతం ముగిశాక పరేడ్ కమాండర్ ఆహ్వానం మేరకు మంత్రివర్యులు వాహనంపై ఆసీనులై పరేడ్‌లో పాల్గొన్న బలగాలను పరిశీలించారు. అనంతరం రెండవ పరేడ్ కమాండర్ ఆర్ఎస్ఐ సంపంగి రావు సారథ్యంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఇందులో ఆర్మీ రిజర్వ్, సివిల్, హోంగార్డులు, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ విద్యార్థి బృందాలతో కలిపి మొత్తం ఆరు ప్లాటూన్లు పాల్గొన్నాయి.

సమన్వయంతో కూడిన ఏకరీతి అడుగులు, లయబద్ధమైన పోలీస్ బ్యాండ్, శ్రద్ధగా ధరించిన దుస్తులు చూసి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. మార్చ్ ఫాస్ట్ అనంతరం బలగాల కవాతు నిష్క్రమణ జరిగింది. ఈ కవాతుపై మంత్రి ప్రశంసలు కురిపించారు.

కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్‌తో పాటు ఎస్పీ సతీష్ కుమార్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు పోలీస్ సిబ్బందికి సేవా పతకాలు, ప్రశంసాపత్రాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పోలీస్ విభాగానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర స్థాయి సేవా పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పతకాలు అందజేసి, విశిష్ట సేవలు అందిస్తున్న పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఉత్తమ సేవా పతకాన్ని డీఎస్బీ గుంటూరుకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం. పిచ్చయ్య అందుకున్నారు. సేవా పతకాలను అదనపు ఎస్పీ ఏఆర్ ఎ. హనుమంతు, ఇన్‌స్పెక్టర్ బెల్లం శ్రీనివాసరావు, ఏఎస్ఐ పి. వెంకటేశ్వరరెడ్డి, ఏఆర్ఎస్ఐ బి. వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎ. సాంబశివారెడ్డి, పి. జాన్ ఖాన్, పి. మైనయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు సయ్యద్ అబ్దుల్ వహాబ్, ఎం. రామ కోటేశ్వరరావు, ఆర్. రాజేంద్రప్రసాద్ పొందారు.

అదే కార్యక్రమంలో మొత్తం 24 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిలో నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఐటీ కోర్ సీఐ ఎండి నిస్సార్ భాష, ఆర్ఐ ఎంటీ శ్రీహరి రెడ్డి, మంగళగిరి రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు, తెనాలి రూరల్ ఎస్సై ఆనంద్, అరండల్ పేట ఎస్సై కృష్ణ బాజీ, తాడికొండ ఎస్సై సత్యనారాయణ, ఆర్ఎస్ఐ సునీల్ బాబు, అలాగే హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సేవా పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్న వారిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందిస్తూ, వారు చూపిన కర్తవ్యనిబద్ధత, ప్రజా భద్రత పట్ల చూపిన అంకితభావాన్ని ప్రశంసించారు.

## ఉత్తమ అధికారులకు అభినందనలు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన అధికారులకు అందించే ఉత్తమ సేవా పురస్కారాలకు కాకుమాను మండలనికి చెందిన పలువురు అధికారులు ఎంపికయి రాష్ట్ర మంత్రులు,జిల్లా అధికారుల చేతుల మీదుగా పురస్కారాలు అందుకోవడం పట్ల బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకులు పలువురు అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ కాకుమాను మండల ఎంపిడిఓ కే.యుగ కీర్తి ఉత్తమ ఎంపిడిఓ గా జిల్లా స్థాయిలో మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మహిళా అధికారిణి విధుల నిర్వహణలో రాజీ లేకుండా నిస్వార్థంగా సేవలందిస్తున్నారన్నారు.మండల అభివృద్ధి లో కీలకంగా పనిచేస్తున్నారని భవిష్యత్తులో మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.నిస్వార్థంగా సేవలందించే అధికారులకు తాము తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.అదే విధంగా మండల రెండవ విద్యా శాఖ అధికారి కే.విజయ భాస్కర్ ఉత్తమ విద్యా శాఖ అధికారిగా,తహసిల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీదేవి నాగరాజ కుమారి లు జిల్లా స్థాయిలో ఉత్తమ పురస్కారంలు అందుకోవడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ప్రతి ఒక్కరూ కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందించాలని కోరారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట లక్ష్మి,జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్ శర్మ,స్థానిక నాయకులు ఆదిలక్ష్మి, సజ్జనరవు పలువురు నాయకులు ఎంపిడిఓ యుగ కీర్తి, ఎం ఈ ఓ విజయ భాస్కర్,కంప్యూటర్ ఆపరేటర్ శ్రీదేవి నాగరాజ కుమారి లకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్)** మైదుకూరు పట్టణం నందలి మార్కెట్ యార్డు కార్యాలయం నందు స్వాతంత్ర దినోత్సవ జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శీలం వనజ గౌడ్ దంపతులు అంబేద్కర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు..దేశసమగ్రత ప్రగతి కోసం ప్రతి ఒక్కరు సమైక్యంగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు..ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య ఫలాలు ప్రజలకు చేరువ చేయడమె అధికారుల కర్తవ్యం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** మహనీయుల త్యాగాలతో లభించిన స్వాతంత్ర ఫలాలను ప్రజలందరికీ చేరువ చేయడంలో, శాఖ పరంగా నిబద్ధతతో కూడిన సేవ చేయడమే మహనీయుల కందించే నివాళి అని మండల తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ పేర్కొన్నారు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణాన్ని అధునాతనంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో , స్వాతంత్ర దినోత్సవ వేళ మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణం కొత్త సొగసులు సంతరించుకుంది. ఈ క్రమంలో ఎన్సిసి క్యాడేట్స్ కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిర్వహించిన కార్యక్రమంలో మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కెవి. గోపాలకృష్ణ మాట్లాడుతూ సమయపాలన క్రమశిక్షణ జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే ప్రధాన అంశాలని అన్నారు. మహాత్మా గాంధీజీ అహింసావాదం, భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ ల సాయుధ పోరాటం, ఎంతోమంది మహనీయులు దేశ స్వాతంత్ర సాధన కోసం వారిదైన పందాలో, భారతదేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారని వారందరూ మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. విధి నిర్వహణలో వ్యక్తిగా కుటుంబానికి, ఉద్యోగిగా సమాజానికి మెరుగైన సేవలు అందించడమే నిజమైన స్వాతంత్రానికి నిదర్శనం అన్నారు. రెవెన్యూ శాఖ పరంగా తెనాలి మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలో, తన విధి నిర్వహణలో 38వేల మందికి సేవలు అందించినట్లు తెలిపారు. కార్యాలయం పరిశుభ్రంగ ఉండడంతోపాటు కార్యాలయానికి వచ్చే వారికి మౌలిక వసతులు కూడా ఉండాలన్న భావనతో కార్యాలయ ఆధునీకరణ పనులు చేపట్టామని, ఈ కార్యాలయం తనకు శాశ్వతం కాదని, ఉన్నంతకాలం ఉన్నతమైన సేవలు అందించడమే తమ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు, కార్యాలయ సిబ్బందికి, స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## కొండపాటూరులో బాల్ బ్యాడ్మింటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి

**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** బాల్ బ్యాడ్మింటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పోలినేని అంకమ్మ చౌదరి శుక్రవారం కాకుమాను మండల పరిధిలోని కొండపాటూరు గ్రామంలో పర్యటించారు.గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో మొక్కు తీర్చుకోడానికి బంధుమిత్రులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపాటూరు గ్రామానికి చెందిన తాను కొంత కాలం పెదనందిపాడులో ఉండేవారమని ఆ తర్వాత విజయవాడలో కాలేజీ ఫిజికల్ డైరెక్టరుగా పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ప్రస్తుతం బాల్ బ్యాడ్మింటన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ తన సేవలు అందజేస్తున్నానన్నారు. మెరుగైన క్రీడాకారులను తయారు చేయిస్తూ అంకమ్మ చౌదరి జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకున్నారు.ఈ సందర్భంగా తాను బాల్యంలో కొండపాటూరులో గడిపిన రోజులను ఆయన గుర్తు చేసుకుని ఎంతో సంతోషించారు. గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని పేర్కొన్నారు. ఎక్కడ ఉన్నా కొండపాటూరు గూర్చి తెలుసుకుంటున్న అని కొండపాటూరుకు మంజూరైన హైస్కూలు భవనాన్ని పది గదులతో నిర్మించ బోవడాన్ని తెలుసుకొని ఆనందపడినట్లు ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

## స్వాతంత్ర్య పోరాటమే కోర్కెల సాధనకు స్ఫూర్తి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** స్వాతంత్ర పోరాటమే జటుల సమస్యల సాధనక స్ఫూర్తి అని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్ మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు.

స్థానిక రామలింగేశ్వర పేటలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తాడి బోయిన హరిప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకి స్వతంత్ర ఫలాలు అందించేందుకు మహనీయులు చేసిన త్యాగాలు ఎనలేనివని కొనియాడారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నుండి స్వతంత్రం సాధించేందుకు మహనీయులు చేసిన పోరాటాలు, ఉద్యమాలు నిరుపమానమని కొనియాడారు. మహనీయులు అందించిన స్వతంత్ర ఫలాలు కారణంగానే భారతదేశం నేడు ప్రపంచంలో ఒక శక్తివంత మైన దేశంగా ముందుకెళ్తోంది అన్నారు. త్యాగ మూర్తులు స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గ తీర్చిదిద్ద డానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అరుణ, నాయకులు కుద్దూస్ ఈదర పూర్ణచంద్ , అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు , పినపాటి రవీంద్ర, ఈదర వెంకట పూర్ణచంద్ ,మల్లవరపు విజయ్ ,అశోక్ వర్ధన్ ,అనిత, ప్రసాద్, సత్యనారాయణ, రబ్బాని ,వెంకటేష్, కోగంటి వెంకటేశ్వరరావు ,ఎం శ్రావణి, సాంబయ్య, దేవిడ్, జయకృష్ణ కుదరవల్లి శ్రీనివాస్ ,భాస్కర్, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలు కూటమి తోనే సాధ్యం



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం గా ఉమ్మడి కూటమి పని చేస్తుందని కాకుమాను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మామిళ్లపల్లి.రాం గోపాల్ తెలిపారు.శుక్రవారం నాడు ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించినా స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్ సర్వీస్ లో భాగంగా మండల కేంద్రం అయిన కాకుమాను లో బస్ లకు ఉమ్మడి కూటమి నాయకులు ,మహిళలు కొబ్బరికాయలు కొట్టి,హారతులు ఇస్తూ బస్సు లకు ఘన స్వాగతం పలికారు.అనంతరం బస్సులలో మహిళలు ఉచిత టికెట్ తీసుకొని ప్రయాణించినారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముందు చూపు ఉన్న నాయకులతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.నాడు చెప్పారు నేడు అమలు చేస్తున్నారని తెలిపారు.అన్ని రంగాలలో అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి నాయకులు సునీల్ చౌదరి, ఎన్.అగస్టిన్ ,పూర్ణ చంద్ర రావు,శ్రీధర్ శర్మ,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ కార్యాలయం లో వేడుకలు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు క్యాంపు కార్యాలయం నందు జాతీయ జెండా వందన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు డా. రామాంజనేయులు మాట్లాడుతూ ఎందరో సమరయోధుల పోరాటం మరెందరో మహనీయుల త్యాగఫలం నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యం అని అన్నారు. నాటి స్వాతంత్రోద్యమ లక్ష్య సాధనలో భాగంగా పీ - 4 కార్యక్రమంతో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, అంతరాల్లేని సమ సమాజాన్ని స్థాపించేందుకు బాటలు పడుతున్నాయన్నారు. విజనరీ సీఎం చంద్రబాబు స్ఫూర్తిదాయక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలో శరవేగంగా పురోగమిస్తూ, దేశాభివృద్ధిలో భాగమవుతోంది అన్నారు. ఈ కార్యక్రమం లో నియోజవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర వేడుకల్లో ఎంపిపి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక బ్రహ్మంగారిమఠం ఎంపీడీవో కార్యాలయం నందు మండల ఎంపీపీ చిలేకాంపల్లి వీరనారాయణరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జునరావు మరియు ఆఫీస్ సిబ్బంది నాయకులు పోచం రెడ్డి రామిరెడ్డి జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా స్థానిక పరేడ్ గ్రౌండ్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం గుంటూరు నసీర్ పాల్గొన్నారు. తొలుత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే నసీర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నారా లోకేష్ తోపాటు సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శతకా ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ త్యాగధనులను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు.

## ఉత్తమ ఎంపిడిఓ గా యుగ కీర్తి



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ శాఖలలో విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే అధికారులను ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాలను అందిస్తుంది.ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలలో అందించే జిల్లా స్థాయి పురస్కారాలకు కాకుమాను మండలానికి చెందిన ఎంపిడిఓ కే.యుగ కీర్తి ఎంపికయ్యారు.జిల్లా కేంద్రం లో జరిగిన వేడుకలలో రాష్ట్ర మంత్రి నారా.లోకేష్,జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ల చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భముగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,పంచాయితీ కార్యదర్శులు ఎంపిడిఓ యుగ కీర్తి కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భముగా ఎంపిడిఓ యుగ కీర్తి మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు ,మండల ప్రజలందరి సహకారంతోనే ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశిత గడువులో ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా సక్రమంగా జరగడానికి కృషి చేస్తున్నామన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమం లను సక్రమంగా అమలు చేస్తూ మండల అభివృద్ధి కొరకు తమ వంతు శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు.

## మహనీయుల అడుగుజాడల్లో నడవాలి: బలసాని

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):**ఎందరో మహనీయుల ప్రణ త్యాగాల ఫలితమే మనమందరం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యం అని అలాంటి మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వైఎస్ఆర్సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని.కిరణ్ కుమార్ తెలిపారు.గుంటూరు రూరల్ మండల పరిధిలోని ఎటుకురు బైపాస్ రోడ్ లో గల వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయం నందు 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భముగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలితాలను గూర్చి తెలియజేశారు.ఈ కార్యక్రమం లో నియోజకవర్గ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతదేహాల ఖననంపై ఆలయం నుంచే ఆదేశాలు!



## ధర్మస్థల తవ్వకాల్లో బయటకు వస్తున్న రోజుకో నిజం

**మైసూరు, ఆగస్టు 15 :** ధర్మస్థలి మృతదేహాలకు సంబంధించి రోజుకో కొత్త నిజం వెలుగులోకి వస్తోంది. మృతదేహాల ఖననానికి సంబంధించి నేరుగా ఆలయం నుంచే సూచనలు వచ్చాయని మాజీ పారిశుద్ధ్య కార్మికుడు ఆరోపించాడు. సూపర్‌వైజర్లు బలవంతం చేయగా ఈ రెండు దశాబ్దాల కాలంలో ఎంతోమంది పిల్లలు, మహిళలు, పురుషుల మృతదేహాలను ఖననం చేసినట్లు వెల్లడించాడు. అలాగే, తాను ఎల్లప్పుడూ మృతదేహాలను పాత రోడ్లపై లేదా అటవీ ప్రాంతంలో పాతిపెట్టానని చెబుతున్నాడు. సైట్ నంబర్ 13వద్ద 70-80మృతదేహాలను ఖననం చేశానని పేర్కొన్నాడు. కొన్ని శవాలను కొండల్లో పాతిపెట్టినట్లు తెలిపాడు. ఏ ప్రాంతంలో పాతి పెట్టాలనేది ఆలయానికి సంబంధించిన వ్యక్తులే చెప్పేవారని.. అక్కడేపాతిపెట్టేవాడినని అన్నాడు. అలాగే తాము ఎన్నో మార్లు పగటిపూటే మృతదేహాలను పూడ్చిపెట్టడం స్థానికులు చూశారని కానీ ఎవరూ తమని ఆపలేదని లేదా ప్రశ్నించలేదని ప్రధాన సాక్షి చెప్పాడు. చాలా మృతదేహాలపై లైంగిక వేధింపుల సంకేతాలు స్పష్టంగా కనిపించేవని ప్రధాన సాక్షి వెల్లడిస్తున్నాడు. తనతో పాటు మరికొందరు కలిసి బృందంగా ఏర్పడి దాదాపు 100 మృతదేహాలను ఖననం చేయగా వాటిలో 90 మహిళలవే నని అంటున్నాడు. అయితే, ఆలయ మేనేజర్ ఒక రూం బాయ్ ద్వారా మృతదేహాల ఖననానికి సంబంధించిన పనులను పురమాయించేవాడని పేర్కొన్నాడు. కాగా, ఇప్పటివరకు ఒకే ఒక్క ప్రదేశంలోనే మానవ అవశేషాలు బయల్పడడానికి గల కారణం.. భూమి కోతకు గురవ్వడం, అడవుల పెరుగుదల, నిర్మాణ పనులే అయి ఉండవచ్చని చెప్పాడు. ఆలయ ప్రతిష్ఠను భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడనే ఆరోపణలను మాజీ పారిశుద్ధ్య కార్మికుడు తీవ్రంగా ఖండించారు. ఆలయం పేరును కళంకం చేయడం ద్వారా నాకేంవస్తుంది నేను షెడ్యూల్డ్ కులానికి చెందిన హిందువును అని వాపోయాడు. అపరాధ భావనకు గురికావడం వల్లే 10 సంవత్సరాల తర్వాత ఈ విషయాలు వెల్లడించానని అన్నాడు. సిట్ నిజాయితీగా దర్యాప్తు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా, ఇతడి ఆరోపణలు కర్ణాటక వ్యాప్తంగానే కాదు. దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి.ఇప్పటి వరకు15 ప్రదేశాల్లో తవ్వకాలుజరిపారు. అయితే, ఒకేఒక్క ప్రదేశం.. స్పాట్ 6లో మానవ అవశేషాలు లభ్యమయ్యాయి. ధర్మస్థలలో 1995 నుంచి 2014 వరకూ పనిచేసిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు జులై 3న పోలీసులను ఆశ్రయించి సంచలన ఆరోపణలు చేశాడు. తాను అక్కడ పనిచేసే సమయంలో అనేకమంది బాలికలు, మహిళలు లైంగిక దాడులకుగురై చనిపోయారని వారి మృతదేహాలను తానే ఖననం చేశానని తెలిపాడు. తన కుటుంబానికే చెందిన ఓ మైనర్ బాలిక పైఅధికారుల లైంగిక వేధింపులకు గురైందని, ఆ ఘోరం తట్టుకోలేకే 2014లో అక్కడ పనిమానేసి వెళ్లిపోయానని పేర్కొన్నాడు. అప్పటి నుంచీ తనను తాను క్షమించుకోలేక పోతున్నానని.. బాధితులకు న్యాయంచేయాలన్న లక్ష్యంతో ఇప్పుడు బయటకు వచ్చానని పేర్కొన్నాడు. ఈ ఆరోపణల ఆధారంగా మంగళూరు పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు. ఈ కేసులో అత్యంత కలకలంరేపిన అంశంఏమిటంటే, మృతదేహాలను త్వరగా కుళ్లిపోయేందుకు కొన్ని నేత్రావతీ నది ఒడ్డు వద్ద ఖననం చేశానని అతడు చెప్పాడు. 2010లో పాఠశాల డ్రెస్‌లో ఉన్న ఓ బాలికను మరోచోట పాతిపెట్టిన విషయాన్ని కూడా వెల్లడించాడు. కొన్ని కేసుల్లో హింస, లైంగిక దాడులకు సంబంధించిన ఆధారాలు స్పష్టంగా కనిపించాయని తెలిపాడు. జులై 11న బెళ్తంగడి న్యాయస్థానంలో విచారణకు హాజరై ఈ మేరకు వాంగ్మూలం కూడా ఇచ్చాడు.



# కన్నడ నటుడు దర్శన్‌కు బెయిల్ రద్దుచేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 :** అభిమాని హత్య కేసులో కన్నడ స్టార్ నటుడు దర్శన్‌కు భారీ షాక్ తగిలింది. ఈ కేసులో నటుడికి బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. గతేడాది డిసెంబర్‌లో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పును సుప్రీం ధర్మాసనం పక్కన పెట్టింది. ఈ మేరకు జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. దర్శన్‌కు బెయిల్ ఇచ్చేందుకు ఎలాంటి చట్టపరమైన కారణాలు లేవని పేర్కొంది. బెయిల్ మంజూరు చేయడం విచారణపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. నిందితులు ఎంతటి వాళ్లైనా చట్టానికి అతీతులేం కాదని వ్యాఖ్యానించింది. కస్టడీలో దర్శన్‌కు ఎలాంటి ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదని జైలు అధికారులకు సూచించింది. అంతేకాదు దర్శన్‌ను త్వరగా అదుపులోకి తీసుకోవాలని ఆదేశించింది.

గతేడాది కర్ణాటకకు చెందిన రేణుకా స్వామి అనే యువకుడు అత్యంత దారుణంగా హత్యకి గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసులో దర్శన్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్‌తో పాటు నటి పవిత్రగౌడ సహా 16మందిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పవిత్ర గౌడకు సంబంధించిన అసభ్యకర ఫొటోలు పంపించాడన్న ఆరోపణల్లో దర్శన్ అండ్ టీం రేణుకాస్వామిని బెంగళూరుకు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్రదుర్గకు తీసుకెళ్లి దారుణంగా హత్య చేసిందని విచారణలో తేలింది. రేణుకా స్వామిని దారుణంగా కొట్టి, కరెంటు షాక్‌లు ఇచ్చినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది.

**దర్శన్‌కేసులో నటి పవిత్రా గౌడ అరెస్టు**

దేశవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేసిన రేణుకా స్వామి హత్య కేసులో తాజాగా కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నటి పవిత్రా గౌడను గురువారం బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. సుప్రీం కోర్టు, కర్ణాటక హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసిన వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

అయితే, కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ పై గురువారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్‌ను రద్దు చేస్తూ కీలకవ్యాఖ్యలు చేసింది. హైకోర్టు తీర్పులో స్పష్టమైన లోపాలు ఉన్నాయి. ఆమెకు బెయిల్ ఇవ్వడానికి సరైన న్యాయ కారణాలు లేవు అని జస్టిస్ జేబీ పార్దివాలా,ఆర్ మహాదేవన్ ధర్మాసనం అభిప్రాయపడింది.



# హాంటర్ బైడెన్‌పై బిలియన్ డాలర్ల దావా వేస్తా

## యుఎస్ ప్రథమ పౌరురాలు మెలనియా ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 15 :** అమెరికాలో హైప్రొఫైల్ సెక్స్ కుంభకోణంలోని విషయాలు ఇటీవల మళ్లీ తెరపైకి వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా ప్రథమ పౌరురాలు మెలనియాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌నకు పరిచయం చేయడంలో ఎప్‌స్టీన్ కీలక పాత్ర పోషించాడంటూ ట్రంప్ జీవిత విశేషాలు రాస్తున్న మైఖెల్ వోల్ఫ్ సంచలన ప్రకటన చేశారు. యుఎస్ మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హాంటర్ బైడెన్‌కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన మెలనియా.. హంటర్‌పై 1 బిలియన్ డాలర్లకు (రూ. 8.7 వేల కోట్లు) దావా వేస్తానని హెచ్చరించారు. మెలనియా తరఫు న్యాయవాది అలెజాండ్రో బ్రిటో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. హాంటర్ వ్యాఖ్యలు మెలనియా పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు ఆమెకు ఉందన్నారు. హాంటర్ తన తప్పుడు ప్రకటనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే మెలానియా ట్రంప్‌నకు కలిగిన పరువు నష్టానికి 1 బిలియన్ డాలర్లు దావా వేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ హెచ్చరికపై హాంటర్ ఇప్పటివరకు స్పందించలేదు.

# పాక్ స్వాతంత్ర్య వేడుకల్లో 'గన్‌ఫైర్' ముగ్గురు మృతి

## వేర్వేరు చోట్ల తుపాకీ కాల్పుల్లో 64 మందికి గాయాలు

**ఇస్లామాబాద్, ఆగస్టు 15 :** పాకిస్థాన్‌లో స్వాతంత్ర్య దినోత్సవాలు శ్రుతి మించాయి. కరాచీ నగరవ్యాప్తంగా అనేకచోట్ల 'గన్‌ఫైర్'తో వేడుకలు చేసుకున్నారు. ఈ ఘటనలో ఎనిమిదేళ్ల చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. నగరంలో వేర్వేరు చోట్ల జరిపిన తుపాకీ కాల్పుల్లో 64 మంది గాయపడ్డారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లో వివిధ వేడుకల సందర్భంగా తుపాకులు చేతపట్టి, గాల్లోకి కాల్పులు జరుపుతూ వీరంగం సృష్టించే ఘటనలు సర్వసాధారణం. గతేడాది స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న తుపాకీ కాల్పుల్లో దాదాపు 95మందికి గాయాలు కాగా, అంతకుముందు సంవత్సరం 80 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తాజా వేడుకల్లో కరాచీలోని లియాఖతాబాద్, కోరంగి, మెహబూబాబాద్, అఖ్తర్ కాలనీ, బాల్దియా, ఒరంగీ టౌన్‌తోపాటు అనేకచోట్ల గన్‌ఫైర్ చోటుచేసుకుంది. అజీజాబాద్‌లో తూటా తగిలి ఎనిమిదేళ్లచిన్నారి ప్రాణాలు కోల్పోగా, కోరంగి ప్రాంతంలో ఓ వృద్ధుడు చనిపోయాడు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 20 మంది అనుమానితులను అరెస్టుచేసినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. అయితే, నిందితుల నుంచి అత్యాధునిక ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటిని నిర్లక్ష్య, భయభ్రాంతులకు గురిచేసే చర్యలుగా పేర్కొన్న అధికారులు నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# అమెరికా రెండు నాల్కల ధోరణి



## పాక్‌ను ప్రశంసలతో ముంచెత్తిన మార్కో రుబియో

**వాషింగ్టన్, ఆగస్టు 15 :** పహల్గాం ఉగ్రదాడి నెత్తుటి మరకలు ఆరకముందే, పాకిస్థాన్‌పై అమెరికా అనూహ్యంగా ప్రశంసల వర్షం కురిపించింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించిన కొన్ని నెలల్లోనే, అదే పాకిస్థాన్‌కి ఇప్పుడు స్నేహహస్తం చాచడం అంతర్జాతీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇస్లామాబాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఉగ్రవాద వ్యతిరేక పోరులో పాక్ భాగస్వామ్యాన్ని మెచ్చుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనను అమెరికా సహా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ టీఆర్ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా కూడా అమెరికా ప్రకటించింది. అయితే మే నెలలో అమెరికా పర్యటనకు వెళ్లిన పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు ప్రవాస పాకిస్థానీల నుంచి తీవ్ర నిరసన సెగ తగిలింది. కొందరు నిరసనకారులు ఆయన్ను గీదడ్ (నక్క) అని నినాదాలు చేస్తూ అవమానించిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఇంత జరిగినప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్ వైపు మొగ్గు చూపడానికి బలమైన కారణం కనిపిస్తోంది. బలూచిస్థాన్‌లోని అపారమైన ఖనిజ, హైడ్రోకార్బన్ నిక్షేపాలపై అమెరికా కన్నేసింది. చైనా ఆధిపత్యంలో ఉన్న రేర్ ఎర్త్ మార్కెట్‌కు పోటీగా, తమ సరఫరా గొలుసును బలోపేతం చేసుకోవడంలో భాగంగా పాకిస్థాన్‌తో ఈ ఒప్పందానికి అమెరికా ఆసక్తి చూపుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కీలకమైన ఖనిజాలు, హైడ్రోకార్బన్ల వంటి రంగాల్లో పాకిస్థాన్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాం. ఇది ఇరుదేశాల ప్రజల భవిష్యత్తుకు మేలు చేస్తుందని రూబియో పేర్కొన్నారు. అయితే, అమెరికా పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఈ సహకారాన్ని బలోచ్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఒప్పందం వల్ల పాకిస్థాన్ సైన్యం, గూఢచార సంస్థలు మరింత బలపడతాయని, బలూచిస్థాన్ ప్రజల అణచివేత రెట్టింపు అవుతుందని ప్రముఖ బలోచ్ ఉద్యమకారుడు మీర్ యార్ బలోచ్ హెచ్చరించారు. బలూచిస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారా చంద్ మాట్లాడుతూ, ఆసిమ్ మునీర్‌ను మానవత్వానికి శత్రువుఅని అభివర్ణించారు. మతతత్వ నాయకత్వం చేతిలో ఉన్న పాకిస్థాన్ అణ్వాయుధాలు ప్రపంచ భద్రతకు పెను ముప్పు అని, వాటిని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉగ్రవాదం, మానవ హక్కుల ఉల్లంఘనల ఆరోపణలు ఉన్నప్పటికీ, చైనాను నిలువరించే వ్యూహంలో భాగంగా అమెరికా తన ఆర్థిక, భౌగోళిక ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# మోడీ నియోజకవర్గంలో ఓటరు జాబితా మాయ

## బ్రహ్మచారి సాధువుకు 50 మంది కుమారులు

**లక్నో ఆగస్టు 15 :** ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన మరో విచిత్రం వెలుగుచూసింది. ఓటు చౌర్యం జరిగిందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై(ఇసిఐ) రాజకీయ పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో ఓ బ్రహ్మచారి సాధువుకు 50 మంది కుమారులు ఉన్నట్లు చూపుతున్న ఓటరు జాబితా వెలుగులోకి వచ్చింది. ఆ స్వామీజీకి ఉన్నట్లు చెబుతున్న కుమారులలో అతి పెద్ద వయస్కుడికి 72 ఏళ్లు, అతి చిన్న వయస్కుడికి 28 ఏళ్లు ఉన్నాయి. తీవ్ర వివాదంగా మారిన ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఇసి నిష్పాక్షికతపై అనుమానాన్ని వ్యక్తం చేసింది. ఓటరు జాబితాలో పేర్కొన్న వివరాల ప్రకారం వారణాసిలోని రామజానకి ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామ్‌కమల్ దవాస్ 50 మంది ఓటర్లకు తండ్రి. ఆయన చిన్న కుమారుడు రాఘవేంద్రకు 28 ఏళ్లు కాగా పెద్ద కుమారుడు బన్వారీదాస్‌కు 72 ఏళ్లు. 50యేళ్ల స్వామి రామ్‌కమల్‌దాస్ అవివాహితులు. 50 మంది పిల్లలకు తండ్రిగా రామ్‌కమల్ దాస్‌ని ఇసి చూపించింది. చిన్న తప్పిదంగా ఇసి కొట్టిపారేస్తుందా, మోసాన్ని అంగీకరిస్తుందా అని కాంగ్రెస్ ప్రశ్నించింది

# సిఎం యోగిపై ఎస్పీ ఎమ్మెల్యే ప్రశంసల వర్షం

## సమాజ్‌వాదిపార్టీ క్రమశిక్షణ వేటు

**లక్నో, ఆగస్టు 15 :** ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఒక అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యే పూజా పాల్ ప్రశంసల వర్షం కురిపించారు. మాఫియా నేతగా మారిన అతిక్ అహ్మద్‌పై యోగి ప్రభుత్వం అనుసరించిన కఠిన వైఖరిని ఆమె అభినందించారు. తన భర్త హత్య కేసులో నిందితుడైన అతిక్‌ను యోగి ప్రభుత్వం మట్టిలోకలిపిందని ఆమె భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. యూపీ అసెంబ్లీలో విజన్ డాక్యుమెంట్ 2047పై జరిగిన సుదీర్ఘ చర్చ సందర్భంగా ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె సిఎం యోగి ఆదిత్యనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నా భర్తను ఎవరు, ఎలా హత్య చేశారో అందరికీ తెలుసు. నన్ను ఎవరూ పట్టించుకోని సమయంలో సిఎం నామాట విన్నారు. ప్రయాగ్ రాజ్‌లో నాలాంటి ఎందరో మహిళలకు ఆయన న్యాయం చేశారు. నేరస్థులను శిక్షించారని పూజా పాల్‌పేర్కొన్నారు. నా భర్త హంతకుడైన అతిక్ అహ్మద్‌ను ముఖ్యమంత్రి మట్టిలో కలిపే పని చేశారు. ఈ న్యాయపోరాటంలో నేను అలసిపోతున్న తరుణంలో ముఖ్యమంత్రి యోగి నాకు న్యాయం చేశారు. ఈ రోజు రాష్ట్ర ప్రజ లందరూ ముఖ్యమంత్రి వైపు ఎంతో విశ్వాసంతో చూస్తున్నారని ఆమె అన్నారు. 2005 జనవరిలో బీఎస్పీ ఎమ్మెల్యేగా ఉన్న రాజు పాల్‌ను కొందరు దుండగులు కాల్చి చంపారు. ఆయనకు పూజా పాల్‌తో వివాహమైన 9 రోజులకే ఈ దారుణం జరిగింది. అలహాబాద్ వెస్ట్ నియోజక వర్గ ఉప ఎన్నికలో అతిక్ అహ్మద్ సోదరుడు అష్రఫ్ అహ్మద్‌పై రాజుపాల్ గెలుపొందారు. ఈ కేసులో అతిక్ అహ్మద్, అతనిసోదరుడు అష్రఫ్‌ప్రధాన నిందితులుగా ఉన్నారు. వేరే కేసులో దోషులుగా తేలిన వీరిద్దరూ ఏప్రిల్ 2023లో పోలీస్ కస్టడీలో ఉండగానే హత్యకు గురైన విషయం తెలిసిందే.

# పరువు హత్యకేసులో మృతురాలికి నీట్‌లో బెస్ట్‌ర్యాంక్!

**అహ్మదాబాద్, ఆగస్టు 15 :** గుజరాత్‌లోని బనస్‌కాంతా జిల్లాలో పరువు హత్యకు గురైనట్టుగా భావిస్తున్న 18 ఏళ్ల చంద్రిక చౌదరి, ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. భవిష్యత్తులో డాక్టర్ కావాలనుకున్న ఈ యువతిని ఆమె తండ్రి, ఇద్దరు బాబాయిలు హత్య చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. నీట్ కోచింగ్ కోసం పాలన్‌పూర్‌లోని ఒక హాస్టల్‌లో ఉన్న సమయంలో చంద్రిక వివాహితుడైన హారేశ్ చౌదరి అనే యువకుడితో ప్రేమలోపడి సహజీవనం ప్రారంభించింది. ఈవిషయం ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు ఆమెను బలవంతంగా ఇంటికి తీసుకువచ్చి కట్టడి చేశారు. అదే సమయంలో ఒక పాత కేసులో హారేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకుపంపారు. జూన్ 21న జైలు నుంచి విడుదలైన హారేశ్ చంద్రిక ఆచూకీ కోసం గుజరాత్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశాడు. ఈ పిటిషన్ జూన్27న విచారణకు రావాల్సి ఉంది. అయితే, అంతకుమూడు రోజులముందే, జూన్24న చంద్రిక మృతి చెందింది.ఆమెకు పాలలో నిద్రమాత్రలు కలిపిఇచ్చారు.నిద్రలోకి జారుకున్నాక గొంతునులిమి చంపారని ఏఎస్పీ వివరించారు. హారేశ్‌ఫిర్యాదు మేరకుపోలీసులు కేసునమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన ఇద్దరిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మూడో వ్యక్తి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

# దశాబ్దాలు గడిచినా కాశ్మీర్‌లో ఆగని హింస

## విభజనలో చిచ్చురేపిన ర్యాడిక్లిఫ్ లైన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 :** భారత్ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, దేశ చరిత్రలో చెరగని విషాదాన్ని మిగిల్చిన 1947 నాటి విభజన గాయాలు మరోసారి గుర్తుకొస్తున్నాయి. లక్షలాది మంది ప్రాణాలను బలిగొని, కోట్లాది మందిని నిరాశ్రయులను చేసిన ఆవిభజన వెనుక ఉన్నది కేవలం ఒక సరిహద్దు రేఖ. దానిపేరే రాడ్క్లిఫ్ లైన్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ గీతను గీసిన వ్యక్తికి భారతదేశంతో ఎలాంటి సంబంధం లేదు. విభజన ప్రక్రియ చేపట్టడానికి ముందు ఆయనెప్పుడూ ఇక్కడికి రాలేదు. 1947 జూన్ 3న మౌంట్‌బాటన్ విభజన ప్రణాళిక ప్రకటించాక, బ్రిటిష్ ప్రభుత్వం భారత్ నుంచి నిష్క్రమించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో పంజాబ్, బెంగాల్ ప్రావిన్సులను విభజించి భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దును నిర్ణయించే కీలక బాధ్యతను సిరిల్ రాడ్క్లిఫ్ అనే లండన్ న్యాయవాదికి అప్పగించారు. ఆయనకు ఈ పని పూర్తి చేయడానికి కేవలం ఐదు వారాల సమయం మాత్రమే ఇచ్చారు. పాతబడిన జనాభా లెక్కలు, తప్పుదారి పట్టించే నివేదికలే ఆయనకు ఆధారం. క్షేత్రస్థాయి వాస్తవాలు, విభిన్న మతాల ప్రజల మధ్య ఉన్న సామాజిక, ఆర్థిక సంబంధాలను ఆయన ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. రాడ్క్లిఫ్ హడావుడిగా గీసిన ఈ సరిహద్దు రేఖ ఇరు దేశాల ప్రజల జీవితాల్లో పెను విషాదాన్ని నింపింది. ముఖ్యంగా పంజాబ్‌లోని సిక్కు సమాజం రెండుగా చీలిపోయింది. ముస్లింలు అధికంగా ఉన్న గురుదాస్‌పూర్ జిల్లాను భారత్‌కు కేటాయించడం పాకిస్థాన్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. స్వాతంత్రం వచ్చిన రెండు రోజుల తర్వాత ఈ విభజన రేఖను అధికారికంగా ప్రకటించడం గందరగోళాన్ని మరింత పెంచింది. దీని పర్యవసానంగా చరిత్రలో కనీవినీ ఎరుగని హింస చెలరేగింది. శరణార్థులతో బయలుదేరిన రైళ్లు సరిహద్దులు దాటేసరికి శవాల దిబ్బలుగా మారాయి. ఈ ఘోరకలిలో మృతుల సంఖ్య అధికారికంగా 2 లక్షల నుంచి 20 లక్షలవరకు ఉంటుందని అంచనా. సుమారు కోటి మందికిపైగా ప్రజలు తమ ఇళ్లు, ఆస్తులను వదిలి నిరాశ్రయులయ్యారు. ఇది 20వ శతాబ్దంలోనే అతిపెద్ద వలసగా నిలిచిపోయింది. ఈ విభజన ప్రక్రియ సృష్టించిన అతిపెద్ద, సుదీర్ఘ



వివాదం జమ్మూ కశ్మీర్. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఈ సంస్థానం మొదట స్వతంత్రంగా ఉన్నప్పటికీ, పాకిస్థాన్ గిరిజనుల దాడితో అక్కడి హిందూ రాజు భారత్‌లో విలీనం కావాలని నిర్ణయించుకున్నారు. ఇది భారత్, పాకిస్థాన్ మధ్య తొలి యుద్ధానికి దారితీసి, నేటికీ ఇరు దేశాల మధ్య అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా మిగిలిపోయింది. 79 ఏళ్ల గడిచినా, రాడ్క్లిఫ్ గీసిన గీత ఇరుదేశాలమధ్య వైరాన్ని రగిలిస్తూనే ఉంది. సిరిల్ రాడ్క్లిఫ్ తనకు అప్పగించిన పని పూర్తిచేశారు కానీ, ఆ గీత వెంబడి నివసిస్తున్న ప్రజలు మాత్రం తరతరాలుగా దాని మూల్యాన్ని చెల్లిస్తూనే ఉన్నారు.

# సంక్షిప్తంగా..

## బిజెపి మహిళా మేయర్‌కు రెండు ఓట్లు



**పాట్నా, ఆగస్టు 15 :** బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ డ్రైవ్‌పై వివాదం కొనసాగుతున్నది. తాజాగా బిజెపికి చెందిన మహిళా మేయర్‌కు రెండు ఓటరు కార్డులున్నట్లు బయటపడింది. దీంతో ఆ నాయకురాలికి ఎలక్షన్ కమిషన్ నోటీస్ జారీ చేసింది. బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను ఇసి చేపట్టింది. అయితే కొత్తఓటర్లు భారీగాచేరడం, లక్షల్లో ఓటర్లను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ తరుణంలో ముజఫర్‌పూర్ మేయర్, బిజెపి నాయకురాలు నిర్మలా దేవికి రెండు ఓటరు కార్డులున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో ఈనెల 16 లోపు వివరణ ఇవ్వాలంటూ ఇసి నోటీస్ జారీ చేసింది. కాగా, బీహార్ డిప్యూటీ సిఎం, బిజెపి నేత విజయ్ కుమార్ సిన్హాకు రెండు ఓటరు కార్డులు ఉన్నాయని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు.


## పాక్ రక్షణవ్యవస్థలో కొత్తగా 'రాకెట్ ఫోర్స్'

**ఇస్లామాబాద్, ఆగస్టు 15 :** భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా, ప్రత్యేకంగా 'రాకెట్ ఫోర్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిర్ణయం ప్రకటించారు. అయితే ఈ వ్యవస్థ ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్త వాతావరణాన్ని మరింత తీవ్రతరం చేసేలా ఉంది. అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే ఈ దళానికి ప్రత్యేక కమాండ్ ఉంటుందని, యుద్ధ సమయాల్లో క్షిపణుల మోహరింపు, ప్రయోగాన్ని ఇది పర్యవేక్షిస్తుందని పాక్ సైనిక వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా భారత్‌ను దృష్టిలో ఉంచుకొనే ఈ దళాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఓ సైనికాధికారి ఒక ఆంగ్ల వార్తా సంస్థతో చెప్పడం గమనార్హం. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి క్షిపణి దాడులను ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## సిఎం, డిప్యూటీపై కర్ణాటక గవర్నర్‌కు బిజెపి నేత ఫిర్యాదు!

**బెంగళూరు, ఆగస్టు 15 :** కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌పై ఆ రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు బిజెపి నేత దేవరాజేగౌడ ఫిర్యాదు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం డబ్బులు పంచారన్న ఆరోపణల నేపథ్యంలో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అనుమతించాలని కోరారు. హాసన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం డబ్బులు పంచాలని నిర్ణయించామని మాజీ ఎమ్మెల్యే శివలింగగౌడ మాట్లాడిన ఒక ఆడియో క్లిప్‌ను ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. హాసన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయాస్ ఎం.పటేల్ విజయం కోసం ఒక్కో ఓటర్‌కు రూ.500 చొప్పున పంచాలని సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం శివకుమార్, రాజ్యసభ సభ్యుడు ఎన్.చంద్రశేఖర్ సమక్షంలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని శివలింగగౌడ చెప్పడం ఆ వీడియో క్లిప్‌లో స్పష్టంగా ఉందని దేవరాజేగౌడ తన ఫిర్యాదులో తెలిపారు.

## ఎల్‌ఒసి వెంబడి మూడంచెల భద్రతా వ్యవస్థ



**శ్రీనగర్, ఆగస్టు 15 :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని భారత సైన్యం సరిహద్దుల్లో భద్రతను అప్రమత్తం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లా తంగ్ధార్ గ్రామం వద్ద ఎల్‌ఒసి వెంబడి చొరబాట్లను పూర్తిగా అడ్డుకునేందుకు మూడంచెల పటిష్ఠ భద్రతా వ్యూహాన్ని అమలు చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతతో పాటు మానవ వనరులను సమన్వయం చేస్తూ ఈ కొత్త రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ భద్రతా ఏర్పాట్లపై గురువారం ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ నియంత్రణ రేఖ వెంబడి చొరబాట్లకు ఏమాత్రం ఆస్కారం లేకుండా చూడటమే మా ప్రధాన కర్తవ్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మేము మూడంచెల వ్యవస్థను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. మొదటి దశలో అత్యాధునిక నిఘా పరికరాలను వినియోగిస్తున్నారు. రాడార్లు, థర్మల్ ఇమేజింగ్ సైట్లు, ఆయుధాలుహెల్మెట్లకు అమర్చే కెమెరాలు, మానవ రహిత వాహనాలు (యుఎవిలు లేదా డ్రోన్లు) వంటి టెక్నాలజీతో సరిహద్దును 24 గంటలూ పర్యవేక్షిస్తారు. శత్రువుల కదలికలను ముందుగానే పసిగట్టడం దీని ముఖ్య ఉద్దేశం. రెండోదశలో చొరబాటుదారులను భౌతికంగా నిలువరించేందుకు అడ్డంకుల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కీలకమైన ప్రదేశాల్లో వివిధ రకాల ముందుపాతరలతో పాటు ఇతర ఆప్టికల్ వ్యవస్థలను అమర్చారు.చివరిగా మూడో దశలో సైనికులు నేరుగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో భద్రతను పర్యవేక్షిస్తారు.

## జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పతకం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో, రోగులకు సమయానుకూలంగా వైద్య సహాయం చేరవేయడంలో, అంకిత భావంతో సేవలందించడంలో గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. ఈ కృషికి గాను ప్రభుత్వం ఆయనను ఉత్తమ సేవా పతకంతో సత్కరించింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం గుంటూరు నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణకు ఉత్తమ సేవా పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ఆయనను అభినందించారు. జీజీహెచ్ తరపున ఈ పురస్కారం పొందడం గుంటూరు జిల్లాకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

## టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళగిరి పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. టీడీపీ నాయకులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల కృషివల్ల దేశానికి స్వాతంత్రం వచ్చిందని, వారందరి త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ సమాజ హితం కోసం స్వాతంత్ర్య ఫలాలను ప్రతిఒక్కరికి అందించడానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దామర్ల రాజు, షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, వాసా పద్మ,గుత్తికొండ ధనుంజయరావు, బట్టు చిదానంద శాస్త్రి, పినపాటి జీవన్,మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ శ్రేష్టి, షేక్ హుస్సేన్, షేక్ సుభాని, షేక్ ఫిరోజ్, రంగిశెట్టి నరేంద్ర (బాబీ), పల్నాటి నాగేశ్వరరావు,పేరం ఏడుకొండలు, వింజమూరి చంద్రశేఖర్,జంజనం వెంకట సుబ్బారావు, ఎడ్లూరి కోటేశ్వరరావు,కంకణాల శివ, నల్లగొర్ల శివరామకృష్ణ, చింత వెంకటేశ్వరరావు, పానుగంటి చిన్నరావు, షేక్ బాజి, ఖాన్, రంగిశెట్టి పెద్దబ్బాయ్,తుమ్మల అనురాగ్, షేక్ వలి, సయ్యద్ ఖలీల్, షేక్ చిన నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్న ఎస్ఐ వెంకట్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):**స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు మంత్రి నారా లోకేష్ ప్రశంస పత్రాలను అందజేశారు. ఇందులో భాగంగా మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ ను రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించి గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకకాలంలో కేసులో పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసినందుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ, గ్రామీణ సీఐ వై శ్రీనివాసరావు లు ఎస్సై వెంకట్ కు అభినందనలు తెలియజేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులని అందజేసిన పుట్టా



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్)** మైదుకూరు నియోజకవర్గం లోని మైదుకూరు పట్టణం నందలి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉండే రాయల్ సర్కిల్ వద్ద జెండా వందనాన్ని ముగించుకొని అనంతరం మైదుకూరు పట్టణం నందు నివసిస్తున్న 12 మంది కుటుంబ బాధితులకు 25 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పొద్దుటూరులోని తన క్యాంపు కార్యాలయం నందు అందజేశారు.

## విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందాలి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ త్రివర్ణ పథకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందారని నేటి బాలులు రేపటి పౌరులుగా శక్తియుక్తులతో ఎదగాలని రానున్న భవిష్యత్తుకు వారధిగా నిలవాలని యువతలో ఉన్న మేధో శక్తిని పదును పెట్టి దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగం వైపు ముందుకు తీసుకెళ్లాలని తెలియచేస్తూ ఆనాడు ఎంతోమంది త్యాగమూర్త త్యాగ ఫలితాల ఆధారితంగా మనం ఈనాడు స్వేచ్ఛ గా జీవించగలుగుతున్నామని ఇలాంటి మహనీయులను మనం స్మరించుకొని వారిని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన తెలిపారు అనంతరం అధ్యాపకులు ఉషా మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ నిబద్ధత పెంపొందాలని క్రమశిక్షణతో ఉంటే ఏదైనా సుశాధ్యమవుతుందని ఆమె తెలిపారు అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ముడియం గురు స్వప్న మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం పట్ల సమాజం పట్ల పెద్దలపట్ల గౌరవ భావనను పెంపొందించుకోవాలని వారు తెలిపారు అధ్యాపకులు వీరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు అనంతరం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన వివిధ రకాల క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్,అధ్యాపకుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు కార్యక్రమంలో అధ్యాపకులు శారద స్వప్న ఉష వీర లక్ష్మి రమేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐదురకాల బస్ ప్రయాణ సౌకర్యాలు మహిళలకు ఉచితం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** స్త్రీ శక్తి పథకం ద్వారా తెనాలి ఆర్టీసి డిపోలొ మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సేవలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. స్థానిక ఆర్టీసి డిపోలొ శుక్రవారం స్త్రీ శక్తి పథకం ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ కు అధికారులు, మహిళలు. ఘనస్వాగతం పలుకగా, ఉచిత బస్ ప్రయాణ సేవలను మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మహిళలు తమవద్ద ఉన్న, ఏదైనా గుర్తింపు కార్డు చూపించడం ద్వారా, ఒక్క రూపాయి కూడా చార్జి లేకుండా, జీరొ టికెట్ ఇవ్వడం జరుగుతుందని, ఐదురకాల బస్ సర్వీసుల ద్వారా మహిళలకు ఉచిత బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లకు, మహిళల తరపున ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రాబోయె రోజుల్లొ, కొత్తగా 3,వేల ఎలట్రిక్ బస్సులు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈక్రమంలొ మంత్రి మనోహర్ మహిళలతొ పాటు, బస్ టికెట్ తీసుకుని విజయవాడ బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలొ డిపొ మేనేజర్ రాజశేకర్, తహశీల్దార్ కెవి.గోపాలకృష్ణ, కమీషనర్ వివిఎమ్. లక్ష్మిపతి, కౌన్సిలర్ మానసారెడ్డి, జెట్టి రేణుక, తదితర మహిళలు, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ జరిగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, అందరితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ "స్వాతంత్ర్యం అనేది కేవలం ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. ప్రజల మనసుల్లో భయం లేకుండా, అణచివేత లేకుండా స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగిన సమాజమే నిజమైన స్వాతంత్ర్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు నిజమైన ప్రజాస్వామ్య స్వేచ్ఛ వాతావరణాన్ని అనుభవిస్తున్నారు. గత సంవత్సరంన్నర నుండి ప్రజలు ఆనందంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు."

ప్రజల అభివృద్ధి, పారదర్శక పాలన, సమాన న్యాయం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మనకు స్ఫూర్తి. వారి కలల భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. యువత జాతి నిర్మాణంలో ముందుండాలి. ప్రతి పౌరుడు చట్టాన్ని గౌరవిస్తూ, అభివృద్ధి మార్గంలో అడుగులు వేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, మల్లె ఈశ్వర్, మానుకోండ శివ ప్రసాద్, ముత్తినేని రాజేష్, మువ్వా వేణు, గుఱ్ఱం ప్రసాద్, శివ లీల, కరీమూన్, నాగురా, రఫీ, ఉల్లి గోపాల్, ఉప్పతల సాంబ, ములకా సత్య వాణి, కొల్లి అనిల్, డా. ఆలీ, నజీర్, తుమ్మల నాగేశ్వరరావు, కామినేని చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటీష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదని, భారతీయుల స్వేచ్ఛా గీతిక అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జాతీయ జెండా ఎగరవేశారు. నగరంలోని తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయం, మాయాబజార్ సెంటర్, బేరింగ్ అసోసియేషన్, ట్యాక్సీ స్టాండ్ అసోసియేషన్, ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశం సాంకేతికత, విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా ప్రతి రంగంలోనూ అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని తెలిపారు. ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పాకిస్తాన్ పై యుద్ధం ద్వారా దేశ రక్షణ వ్యవస్థ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే స్వాతంత్ర్య లక్ష్యమని, దీని కోసం రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని పేర్కొన్నారు.

## గుంటూరును రాష్ట్రంలోనే ఉత్తమ నగరంగా తీర్చిదిద్దుతాం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు నగర సమగ్రాభివృద్ధే తమ ధ్యేయమని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోనే ఉత్తమ నగర పాలక సంస్థగా గుంటూరును తీర్చిదిద్దుతామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజాప్రతినిధులు–అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తో కలిసి మేయర్ జెండా ఆవిష్కరణ, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిన్నా టవర్, హిమని సెంటర్, ఎన్.టి.ఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎన్.సి.సి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. విధుల్లో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బంది, కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మేయర్ మాట్లాడుతూ, గుంటూరు నగరానికి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఉన్నదని, ఉద్యమ కాలంలో అనేక కీలక సమావేశాలు ఇక్కడ నిర్వహించబడ్డాయని గర్వంగా చెప్పారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న శంకర్ విలాస్ ఆర్.ఓ.బి–నందివెలుగు వంతెన పనులు ప్రారంభించ గలిగామని తెలిపారు. .నగర కమిషనర్ నేతృత్వంలో పారిశుధ్య విభాగంలో చేపట్టిన సంస్కరణలతో జాతీయ స్థాయిలో 'స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్' అవార్డు, రాష్ట్రంలో ఐ.వి.ఆర్.యస్ సర్వేలో వరుసగా మూడు పర్యాయాలు ప్రథమ స్థానం సాధించడం, రాష్ట్రంలోని 3,800 సచివాలయాల్లో ఎంపిక చేసిన ఉత్తమ 20 సచివాలయాలలో 9 గుంటూరు నగర సచివాలయాలే ఉండటం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల ఫార్మసీ కళాశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):**మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో లైబ్రరీ సెల్ మరియు జాతీయ సేవా పథకం లో భాగమైన దేశభక్తి క్లబ్ సహకారంతో ఆగస్టు 15వ తేదీన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడినవి. కార్యక్రమానికి లైబ్రరీ సెల్ కన్వీనర్ శ్రీమతి షేక్. రేష్మా అతిథులను ఆహ్వానించి స్వాగతం పలికారు. అనంతరం దేశభక్తి గీతంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కళాశాల సెక్రటరీ , కరెస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, విద్యార్థులతో కలిసి జాతీయ గీతం పాడారు. తన ప్రసంగంలో ఆమె, "స్వాతంత్ర్యం అనేది మనకు లభించిన గొప్ప వరం, దానిని కాపాడటం మన ప్రతీ పౌరుడి బాధ్యత. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాములరెడ్డి మాట్లాడుతూ మన వృత్తి కేవలం ఉద్యోగం కాదు, అది సేవ. వ్యక్తిత్వ వికాసం, సాంకేతిక పరిజ్ఞానం, మరియు నైతిక విలువలు కలగలిపి ముందుకు సాగితేనే మీరు నిజమైన దేశభక్తులు అవుతారు" అని అన్నారు. విభాగాధిపతులు డాక్టర్ ఎస్. పద్మావతి, డాక్టర్ యూ. స్పందన, డాక్టర్ హరే కృష్ణరాయ్ మాట్లాడుతూ, "స్వాతంత్ర్యం మనకు హక్కులు ఇస్తే, అదే సమయంలో కర్తవ్యాలను కూడా గుర్తుచేస్తుంది. విద్యార్థులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావడానికి విజ్ఞానం, శ్రమ, మరియు సద్భావనతో కృషి చేయాలి" అని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన రోల్ ప్లే, దేశభక్తి గీతాలు, నృత్యాలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. లైబ్రరీ సెల్ నిర్వహించిన వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, కళాశాల వివిధ విభాగాధిపతులు, డాక్టర్ సుధీర్, డాక్టర్ ఫైజాన్ అలీ, డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ సౌజన్య, డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వ చెలగాటం

○ **వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు నెలవై ఉండే వసతిగృహాలు, గురుకుల విద్యాలయాలపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, "పిల్లికి చెలగాటం – ఎలక్కి ప్రాణ సంకటం" లా మారిందని వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మండిపడ్డారు. పూర్తి స్థాయి నిర్లక్ష్యం, అలవికాని అలసత్వంతో పేద విద్యార్థుల విలువైన జీవితాలను కూటమి ప్రభుత్వం హరిస్తోందని కన్నెర్ర చేశారు. అడిగే వారు లేరని బొద్దింకల భోజనం, కాళ్ళజెర్రి కర్రీ, బల్లుల సాంబారుతో ఆహారం పెడుతూ వారిని అనారోగ్యం బారిన పడేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హిందూపురం గురుకుల విద్యాలయంలో విషపూరితమైన అల్పాహారం తిని వాంతులు, విరేచనాలతో విద్యార్థులు ప్రభుత్వాసుపత్రి పాలైన ఉదంతంపై పానుగంటి చైతన్య మండిపడ్డారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వానికి, ప్రత్యేకించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేద విద్యార్థులంటే అలుసని ఆరోపించారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాలను పాడుబెడుతున్నారని విమర్శించారు. కడుపు నిండా సరైన తిండి పెట్టకుండా.. కంటి నిండా మంచి నిద్ర పోనీయకుండా విద్యార్థులను నరకయాతనకు గురి చేస్తున్నారని నిందించారు. ఈ అకృత్యాలన్నీ వెలుగులోకి తెచ్చి ఎక్కడ వారి తరుపున పాలకులను ప్రశ్నించి, విద్యార్థులకు అండగా నిలబడతామన్న ఆందోళనతోనే హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ దుర్మార్గంగా రెండు జీవోలను తెచ్చిందని ఆయన ధ్వజమెత్తారు. వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం వలన ఇటువంటి అనర్థాలు పెచ్చుమీరతాయని పానుగంటి చైతన్య అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ అప్రజాస్వామిక నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన విద్యార్థి సంఘాలను, విద్యార్థులను కలవనీయకపోవడం అంటే అది నేరుగా విద్యార్థి హక్కులను హరించడం కిందకే వస్తుందని ఆయన ఫైర్ అయ్యారు. స్వయానా ముఖ్యమంత్రి వియ్యంకుడు, విద్యాశాఖ మంత్రికి పిల్లనిచ్చిన మేనమామ అయిన బాలకృష్ణ సొంత నియోజకవర్గమైన హిందూపురంలోనే హాస్టళ్లు, గురుకులాల పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగిలిన ప్రాంతాల్లో ఉన్న వాటి దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పని లేదని పానుగంటి చైతన్య వ్యాఖ్యానించారు. బాలకృష్ణ తన నియోజకవర్గాన్ని గాలికొదిలేసి సినిమాల్లో వేషాలు వేసుకుంటూ బిజీగా గడుపుతున్నారని ఆయన గుర్రుమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు తిరుగుబాటు చేయక ముందే చిత్తశుద్ధితో వారి సంక్షేమానికి కట్టుబడాలని హితవు పలికారు. లేని పక్షంలో విద్యార్థుల తరుపున రాజీ లేని పోరాటాలకు వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ సిద్ధమని పానుగంటి చైతన్య ప్రకటించారు.

## గుంటూరు నగర పాలక సంస్థకు ఉత్తమ సేవా పతకం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ విభాగాల్లో మెరుగైన సేవలు అందించినందుకు గుంటూరు నగర పాలక సంస్థకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పతకం లభించింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ శుక్రవారం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డును నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులకు షీల్డ్ మరియు ప్రశంసాపత్రం రూపంలో అందజేశారు.

అంతేకాక, తడి–పొడి వ్యర్థాల విభజన అంశంపై నగర పాలక సంస్థ రూపొందించిన శకటానికి రాష్ట్రస్థాయిలో 3వ స్థానం లభించింది. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, ఈ అవార్డులు గుంటూరు నగర ప్రజలకు మరింత మెరుగైన త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనలో ప్రోత్సాహాన్నిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యస్. నాగలక్ష్మి, జిల్లా ఎస్.పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ )** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని చెప్పిన దరిమిలా ఈరోజు అనగా శుక్రవారం మైదుకూరు టు మల్లేపల్లి టు బి.మఠం ఆర్టీసీ బస్సును మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ బస్సు రోజుకు 8 సింగిల్ లు గా నడుస్తుందని ఆయన తెలియజేశారు. కావున ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పెదవడ్లపూడి నుంచి భారీ బైక్ ర్యాలీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీ శక్తి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి పెదవడ్లపూడి నుంచి తాడేపల్లి వరకు మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో వరకు కొనసాగి, స్థానికులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ వేడుకల్లో మహిళల ఆత్మవిశ్వాసం, స్వావలంబన, సమాన హక్కుల సాధనకు కృషి చేయాల్సిన అవసరాన్ని జవ్వాది కిరణ్ చంద్ ప్రస్తావించారు. స్త్రీ శక్తి లోగోలు అందజేయగా, బైక్ ర్యాలీ మార్గమంతా నినాదాలు మార్మోగాయి.

## పోరాట యోధుల త్యాగఫలం మన స్వాతంత్ర్యం



**తెనాలి15,(జర్నలిస్ట్ ఫైల్)** నాటి పోరాట యోధుల త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్ర్యమని, లభించిన స్వాతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ, 10 మంది ప్రయోజనానికి విధి నిర్వహణలో పాటు పడాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కమిషనర్ వి ఎం లక్ష్మీపతి మాట్లాడుతూ నాటి పోరాట యోధులు త్యాగాల ఫలితమే మనము అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలని అన్నారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కార్యాలయంలో విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందిస్తున్న వారిని గుర్తించి, వారిని సేవా సర్టిఫికెట్లతొ, సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, ఎంహెచ్ఓ మొవ్వా ఏసుబాబు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి తదితర కార్యాలయ వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మాతగోవిందమాంబ అమ్మవారికి సారె బహుకరణ



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మాత గోవిందమాంబకు సారే చీర పసుపు కుంకుమ బహుకరణ కార్యక్రమం వైభవోపేతంగా జరిగాయని. కోలాట బృందాలు భజన బృందాలు స్వామి వారి నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయనీఅమ్మవారికి సంకల్ప పూజ అభిషేకం కుంకుమార్చనతో కార్యక్రమాలు జరిగాయనీపూర్వ మఠాధిపతి ఐదవ కుమారుడు గోవింద స్వామి ఆధ్వర్యంలోస్థానిక అచలానంద ఆశ్రమం మఠాధిపతి శ్రీ విరజానంద స్వామి వారు అనుగ్రహ భాషణతో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగినట్టు శ్రీ బ్రాహ్మణి సేవా సంస్థ అధ్యక్షురాలు కార్యక్రమ నిర్వాహకులు రమాదేవి ఒక ప్రకటనలో తెలియచేసారు. ఈ కార్యక్రమంకు విశిష్ట అతిధులుగా పూర్వ మఠాధిపతి శిష్యులు కర్ణాటక మాజీ మంత్రివర్యులు మాజీ పార్లమెంట్ సభ్యులు గాలి కరుణాకర రెడ్డి కుటుంబసమేతంగా హాజరయ్యారని చెప్పారు. వారు శ్రీ గోవింద స్వామిని ఘనంగా పూలమాలాంకృతుని చేసి పట్టు వస్త్రంతో సన్మానించారనీపూర్వ మఠాధిపతి సోదరుడు నొస్సాం వీరభద్ర స్వామి శ్రీ బ్రహ్మణి సేవా సంస్థ అధ్యక్షురాలు రమాదేవి కాపు బలిజ తెలగ రాష్ట్ర సంఘం నాయకులు సేగినేని పోతులూరయ్య ఆధ్వర్యంలో విశేష సంఖ్యలో హాజరైన మాతృ మూర్తులకు పూజ గాజులు పసుపు కుంకుమలు వస్త్ర బహుకరణ చేసామని వారు చెప్పారు. ఉదయం అల్పాహారం మధ్యాహ్నం అన్న ప్రసాద బహుకరణ మాన్యశ్రీ కరుణాకర రెడ్డి కుటుంబ సభ్యులు చేసారని చెప్పారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## స్త్రీశక్తి పథకం విజయవంతం చేసేందుకు కృషి - ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



- ముఖ్యమంత్రికిఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు) విజ్ఞప్తి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీశక్తి పథకాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని, అలాగే ప్రభుత్వ పరిధిలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు) రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రికి లేఖ అందజేసింది.ఆగస్టు 15న విజయవాడ పిఎన్బిఎస్ బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రికి ఈ లేఖను రాష్ట్ర కమిటీ తరపున అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.డి. ప్రసాద్ అందజేశారు.లేఖలో ప్రభుత్వం ఐదేళ్లుగా అనుమతి ఇవ్వని ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, స్త్రీశక్తి పథకం విజయవంతం కావాలంటే 3000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, కేటగిరీల వారీగా ఉన్న 10,000 ఖాళీలనుకండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది మరియు ఇతర విభాగాలువెంటనే భర్తీ చేయాలని కోరారు.గత ప్రభుత్వం కాలంలో పెండింగ్‌లో ఉన్న 11వ పిఆర్సీకి సంబంధించిన 24 నెలల అరియర్స్, డిఏ బకాయిలు, కొత్త డిఏలు వెంటనే ప్రకటించాలని, ఎన్నికల ముందు కూటమి హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పిఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు విలీనానికి ముందున్న వైద్య సౌకర్యాలను పునరుద్ధరించాలని, ఇహెచ్ఎస్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.అలాగే మెడికల్ అన్ఫిట్ అయిన ఉద్యోగి లేదా వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం ఇవ్వాలని, గుర్తింపు సంఘాలకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో అవకాశం కల్పించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్‌లో ఉన్న ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఆన్‌కాల్/అద్దె బస్సు డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## మహనీయుల త్యాగాలు మరువలేనివి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** స్వాతంత్ర్య సిద్ధి కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి శ్రీనివాసులు 79వ స్వాతంత్ర దినోత్సవ వేళ జాతీయ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా అమరవీరులను స్మరించుకున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి కోర్టు ల ప్రాంగణంలో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి శ్రీనివాసులు జాతీయ జండాను ఎగరవేసి జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు న్యాయ దేవత విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం. ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం లో న్యాయమూర్తులు రాజశేఖర్ శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, అన్నం పిన్నారావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం దేవస్థానంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు, పలువురు శాఖాధిపతులు, విభాగాధిపతులు, సిబ్బంది, శివసేవకులు, ఎస్‌పిఎఫ్ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.
దేవస్థాన పరిపాలనా కార్యాలయ భవన ప్రాంగణంలో మహాగణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పమాల అర్పించారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, హోంగార్డు సిబ్బంది పతాక వందనం చేయగా, కార్యనిర్వహణాధికారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతంతో వేడుకలు కొనసాగాయి. కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరుకు చెందిన శ్రీ సాయి లిక్షితశ్రీ నృత్య కళాశాల విద్యార్థులు దేశభక్తి గీతాలకు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు ప్రత్తిపాడు శాసనసభ్యులు డా.బూర్ల. రామాంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రజలకు స్థానిక శాసనసభ్యులు డా.బి.రామాంజనేయులు అన్ని విషయాలలో అండగా నిలబడుతున్నారు. తాజాగా అనారోగ్య పరిస్థితుల వల్ల ఆర్థిక సమస్యలతో ఇబ్బందులుపడుతున్న 46 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందించి పేదవారి పట్ల తన చిత్తశుద్ధిని రుజువు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులు 46 కుటుంబాలకు రూ 4,818,431.విలువ చేసే చెక్కులను అందించారు. ముఖ్యమంత్రి నారా. చంద్రబాబునాయుడు పేదవారి కుటుంబాలకు పెద్దకొడుకులా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే లబ్ధిదారులకు తెలిపారు.

## ఉత్తమ మహిళా సి ఐ గా విజయలక్ష్మి



- ప్రశంసా పత్రం అందించిన మంత్రి టీజీ భరత్

**బ్రహ్మంగారిమఠం ఆగస్ట్ - 15(జర్నలిస్ట్ ఫైల్)** 79 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచినందుకు ఉత్తమ సిఐ గా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ విజయలక్ష్మి మంత్రి టి జి భరత్ రంజిత్ బాషా ఐఏఎస్ జిల్లా కలెక్టర్ మరియు విక్రాంత్ పాటిల్ ఎస్పీ కర్నూలు వారి నుండి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ విజయలక్ష్మి ఆమె కర్నూల్ మహిళా పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్నారు. శక్తి టీం జిల్లా ఇంచార్జి గా పనిచేస్తూ మహిళలు పిల్లల పట్ల జరుగు నేరాలను అరికట్టాలనే ఉద్దేశ్యం తో జిల్లాలో ఉన్న అంగన్వాడీ సెంటర్స్ ప్రభుత్వ ప్రవేటు స్కూల్స్ లల్లో పిల్లలకు మంచి చెడులపై బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు.

# మహిళలకు వరం - స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం

- సింగుపురంలో స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ కింజరాపు అచ్చెన్నాయుడు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు సాధికారత కల్పించారు
- రాష్ట్రంలో ఆర్టీసీని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు
- భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నాం



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మహిళలకు మరో సంక్షేమ బహుమతిగా 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకంని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని సింగుపురం గ్రామంలో జెండా ఆవిష్కరించి, సింగుపురం నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో మహిళలతో కలిసి స్వయంగా ప్రయాణించారు. ప్రయాణం సందర్భంగా మహిళలతో ముచ్చటించిన మంత్రి, జీరో ఫేర్ టికెట్లు స్వయంగా అందజేశారు. అనంతరం ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా ఐదు రకాల బస్సుల్లో (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ) మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామన్నారు.
"సమాజంలో సగభాగం అయిన మహిళల గౌరవం, ఆర్థిక సాధికారత పెంపు ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని మంత్రి తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి మహిళలతోనే సాధ్యమని భావించి, డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల సాధికారతకు పునాది వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని అవకాశాలుగా మలుచుకుంటూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన హామీలలో 90 శాతం నెరవేర్చామని, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం తమ మహిళా సంక్షేమపట్ల ఉన్న కట్టుబాటుకు నిదర్శనమన్నారు. ఆర్టీసీ బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం అమలకు రాష్ట్రవ్యాప్తంగా 8,450 బస్సులను సిద్ధం చేసినట్లు తెలిపారు. సంవత్సరానికి సుమారు రెండు వేల కోట్ల వ్యయం కానుందని వెల్లడించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెంపు, ఆర్టీసీ ఖాళీ స్థలాలను వినియోగించి ఆదాయ మార్గాలు పెంచే చర్యలు చేపడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహాయ కలెక్టర్ డి. పృథ్వీరాజ్, ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందం రెడ్డి, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆర్టీసీ డి.సిలు ఎల్.ఎస్. నాయుడు, ఎడిసీ పి. మురళీధర్, పి.వి.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి పథకం.. మహిళల ప్రగతి రథచక్రం

- స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీ శక్తి స్త్రీ శక్తి పథకం మహిళల ప్రగతి రథచక్రంగా మారనుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండ్ లో స్త్రీ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మేయర్ కోవెలమూడి నాని, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం మహిళలకు ఆర్థిక భరోసా కల్పించనుందని తెలిపారు. స్త్రీ శక్తి పథకం మహిళల ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మస్థైర్యానికి పెంపొందిస్తుందని చెప్పారు. చిరు ఉద్యోగులు, కార్మికులు ప్రతి రోజూ ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతుంటారని చెప్పారు. వీరికి ఆర్థిక భారం ప్రతి నెలా రూ. 2వేల నుంచి రూ. 4వేల వం-కు ఉంటుందన్నారు.
స్త్రీ శక్తి పథకం ద్వారా ఇలాంటి మహిళలకు ప్రతి నెలా రూ. 2 వేల నుంచి రూ. 4 వేల రూపాయలు ఆదా కానుందని వెల్లడించారు. ఇది వారి కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. సీఎం చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఇప్పటికే అనేక గొప్ప పథకాలు ప్రారంభించారని, ఈ పథకం గేమ్ చేంజర్ గా మారుతుంది అన్నారు. గుంటూరు జిల్లాలో 43 బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ ద్వారా ఉచిత ప్రయాణాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏటీఎం సత్యనారాయణ, ఇంచార్జ్ ఆర్ఎం సామ్రాజ్యం, డిపో మేనేజర్లు సత్యనారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రంలోని మహిళల సాధికారత కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' – ఉచిత బస్సు ప్రయాణ పథకం గుంటూరు బస్ స్టేషన్‌లో సహచర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "గ్రామాల నుండి పట్టణాలకు రాకపోకలు చేసే పేద మహిళలు నెలకు సుమారు ?10,000 వరకు సంపాదిస్తున్నప్పటికీ, కేవలం ప్రయాణ ఖర్చులకే ?2,000 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు తీసుకొచ్చిన ఈ పథకం వల్ల ఆ భారాన్ని తగ్గించడమే కాకుండా, వారికి ఆర్థికంగా, మానసికంగా కూడా పెద్ద ఉపశమనం లభిస్తుంది" అని తెలిపారు. ఇది కేవలం రవాణా సౌకర్యం కాదు, ఒక సామాజిక విప్లవం ప్రారంభం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభివర్ణించారు.
ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోందన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఇప్పటికే మహిళలకు అండగా ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేశారని, నేడు ఉచిత బస్సును మహిళలకు అందుబాటులో తీసుకొచ్చిందన్నారు.

## శ్రీశైలం అన్నప్రసాద పథకానికి విరాళం

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీ శంకర వెంకట కామేశ్వరరావు రూ.1,01,116 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు యం. రవికుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున దాతకు తగిన రసీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.



## గుంటూరు ఐజీ, ఎస్పీ కార్యాలయాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేసి, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచిపెట్టారు.గుంటూరు రేంజ్ కార్యాలయంలో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం దేశవ్యాప్తంగా కుల, మత, వర్గ, ఆర్థిక భేదాలకతీతంగా జరుపుకునే ఏకైక వేడుక అని పేర్కొన్నారు. మన స్వేచ్ఛ, సమానత్వం కోసం పూర్వీకులు చేసిన త్యాగాలు గుర్తు చేస్తూ, వారసత్వాన్ని కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ స్నేహభావం, సోదరభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అని బాల గంగాధర్ తిలక్ చెప్పిన మాటలను స్మరించుకోవాలని, బానిస భావాలను విడిచిపెట్టి విజయ తీరాల వైపు అడుగులు వేయాలని సూచించారు.క్యాంపు కార్యాలయంలో కూడా కుటుంబ సమేతంగా జెండా వందనం చేసి, పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ, సురేష్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎపి హైకోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం జరిగిన ఈవేడుకలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిధిగా పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ పతాకానికి సెల్యూట్ చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రాణాలను సైతం అర్పించిన మహానుభావులకు శిరస్సు వంచి పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ స్వరాజ్యం, స్వపరిపాలన భారతీయుల జన్మహక్కు అంటూ నినాదాలు చేస్తూ స్వాతంత్ర్య సాధనకై ఎంతో మంది తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వలస వాదుల పాన నుండి భారత దేశాన్నికి విముక్తి కలిగించారన్నారు. నేడు అటువంటి మహానుభావుల అందరినీ స్మరించుకుంటూ శిరస్సు వంచి ప్రణామాలు చేయాల్సిన శుభదినం అన్నారు. ఆ మహానుభావులు దేశానికి చెందిన సేవలను ప్రశంసిస్తూ వారి అడుగుజాడల్లో రాష్ట్ర ప్రజలు అందరూ నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. వారి దేశభక్తి, జాతీయవాదం ప్రస్తుత మరియు రానున్న తరాలవారికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. దేశ సమైఖ్యతను, సమగ్రతను కాపాడేందుకు సరిహద్దుల్లో నిరంతరం పాటుపడుతున్న సాయుధ ధళాల సేవలకు మనం అందరం ఎల్లవేళలా కృతజ్ఞులై ఉండాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.
ఈ వేడుకల్లో భాగంగా అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి మరియు హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం తదితరులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పిస్తూ, రాజ్యాంగం ప్రకారం పౌరులందరి హక్కులను పరిరక్షించడంలో మరియు వారికి సమన్యాయాన్ని అందించడంలో న్యాయ వ్యవస్థ చేస్తున్న కృషిని వివరించారు. ఈ వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, ఏపీ అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీ నారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శకటం.. ప్రగతి రథానికి మకుటం

- స్వర్ణాంధ్ర ఏ 2047 సంకల్పాన్ని చాటిచెప్పిన శకటాలు
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిలువుటద్దమై అలరించిన శకటాలు






**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో శుక్రవారం ఘనంగా జరిగిన 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రదర్శించిన వివిధ శాఖల అలంకృత శకటాలు అలరించాయి. స్వర్ణాంధ్ర ఏ 2047 సాకారం దిశగా వేస్తున్న అడుగుల్లో భాగంగా అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ప్రగతిని చాటిచెప్పేలా శకటాల ప్రదర్శన సాగింది.
మొత్తం 21 శాఖలు, విభాగాలకు చెందిన శకటాలు అతిథులను ఆకట్టుకున్నాయి. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా రూపొందించిన ప్రణాళిక శాఖ పీ4 (పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం, పేదరిక నిర్మూలన కార్యక్రమం) శకటం సుసంపన్న, ఆరోగ్య, ఆంధ్ర దార్శనికతను ప్రతిబింబించింది. అదేవిధంగా వేడుకల్లో సీఆర్‌డీఏ, అమరావతి (కాలాతీత వారసత్వం నుంచి ప్రపంచ స్థాయి భవిష్యత్తు వరకు), పరిశ్రమల శాఖ (స్వర్ణాంధ్ర 2047 - ప్రతి భాగస్వామ్యం పెట్టుబడులను పెంచే చోట), పౌరసరఫరాల శాఖ (దీపం-2), ఆర్‌టీజీఎస్ (రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ ద్వారా స్మార్ట్ గవర్నెన్స్, క్వాంటం వ్యాలీ, వాట్సాప్ గవర్నెన్స్), జల వనరుల శాఖ (హంద్రీనీవా సుజల స్రవంతి - పోలవరం), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పేదల సేవలో - అడవితల్లి బాట), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ (ఎస్ఏఎస్ఏ - వృత్తాకార ఆర్థిక వ్యవస్థ - వ్యర్థ పదార్థాలు, చెత్త నుంచి రీ సైక్లింగ్, పునర్వినియోగం), అటవీ శాఖ (హరితాంధ్ర వన్యప్రాణుల సంరక్షణ, సుస్థిర అభివృద్ధి), రవాణా శాఖ (స్త్రీ శక్తి - మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం), మౌలిక వసతులు, పెట్టుబడులు, మారిటైమ్ బోర్డు (ఆంధ్రప్రదేశ్ - లాజిస్టిక్ హబ్ ఆఫ్ ఈస్ట్), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (యోగాంధ్ర - ఆరోగ్యాంధ్ర), విద్యా శాఖ (ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్), వ్యవసాయ శాఖ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ సహజ వ్యవసాయ నిర్వహణ), సెర్ప్ (25 వసంతాల వెలుగు ప్రస్థానం - పేదరికం నుంచి పారిశ్రామికవేత్తగా), మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (మహిళల రక్షణ - భద్రత - సాధికారత మా ప్రభుత్వ ధ్యేయం), చేనేత మరియు జౌళి శాఖ (ఒక జిల్లా - ఒక ప్రొడక్ట్), పట్టుపరిశ్రమ శాఖ (మేరా రేషం మేరా అభియాన్ - ఆకు నుంచి వస్త్రం వరకు - స్థిరమైన పట్టు వైపు), పర్యాటక శాఖ (క్రాఫ్టింగ్ అనుభవం, జ్ఞాపకాలను సృష్టించడం), మెప్మా (డిజిటల్ ప్రేరణతో సమష్టిగా సాధికారత పొందిన ఒక కుటుంబం - ఒక వ్యవస్థాపకుడు), ఇంధన శాఖ (పునరుత్పాదక శక్తి - హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ శక్తి) శకటాలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
**పట్టు పరిశ్రమ శాఖ శకటానికి మొదటి బహుమతి:** నా పట్టు - నా అభిమానం నినాదంతో పట్టుశాఖ రూపొందించిన శకటం మొదటి బహుమతి సాధించింది. స్వర్ణాంధ్ర లక్ష్య మార్గంలో మహిళల సాధికారతను పెంపొందిస్తూ, పారిశ్రామిక రంగంలో యువతను ప్రోత్సహిస్తూ, గిరిజనుల జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తూ, పట్టు పరిశ్రమ గ్రామీణ ముఖచిత్రాన్ని మారుస్తోంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467